తెలుగు ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. గణపతి ఆశీస్సులతో ప్రతి ఇంటిలో సౌఖ్యం, ఐశ్వర్యం నిండాలని, ప్రతి ఒక్కరి ప్రయత్నాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నాను. భక్తి శ్రద్ధలతో జరుపుకునే వేడుకలు ఆనందం, శాంతి, ఐక్యతను ప్రసాదించాలని ఆకాంక్షిస్తున్నాను.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




బుధవారం 27.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 134 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00

# ఉన్నత విద్యకు ఊతం

- మహిళా దినోత్సవానికి లక్షమంది మహిళా పారిశ్రామిక వేత్తలు
- బలహీన వర్గాలకు బాసటగా బ్యాంకులు ఉండాలి
- నైపుణ్యాభివృద్ధి కోసం ఆర్థిక తోడ్పాటునివ్వండి
- అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్... బ్యాంకుల ప్రధాన కార్యాలయాలు పెట్టండి
- లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తాం... సహకరించండి
- సమయానికి రుణాలివ్వకుంటే ఉపయోగం ఉండదు
- పీ4లో బ్యాంకర్లు భాగస్వామ్యులవ్వాలి
- ఎస్ఎల్బీసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



2లో

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ పెన్యూయర్ విధానంలో భాగంగా లక్ష మంది మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 8వ తేదీన జరగబోయే మహిళా దినోత్సవం నాటికి లక్ష మంది పారిశ్రామిక వేత్తలను చేసి ప్రకటన చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని... దీనికి బ్యాంకర్లు పూర్తిగా సహకరించాలని సీఎం చంద్రబాబు కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. వ్యవసాయం, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, డ్వాక్రా గ్రూపులకు రుణ వితరణ లక్ష్యాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై చర్చించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రాధాన్యతలను సీఎం చంద్రబాబు వివరించారు. అలాగే ఏయే రంగాల్లో సహకారం కావాలనే అంశాన్ని సీఎం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "గతంలో వన్ ఫ్యామిలీ... వన్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్ అంటూ ప్రమోట్ చేశాం. ఇప్పుడు వన్ ఫ్యామిలీ... వన్ ఎంటర్ పెన్యూయర్ అనే నినాదంతో పని చేస్తున్నాం. దీంట్లో భాగంగా మహిళలకు పెద్ద పీట వేయాలని నిర్ణయించాం. వచ్చే ఏడాది మార్చి 8వ తేదీ నాటికి లక్షల మంది మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేలా కార్యాచరణ సిద్ధం చేశాం. దానికి బ్యాంకర్లు సహకరించాలి. బ్యాంకులు అందించే సహకారాన్ని అందుకుని ఏపీ డ్వాక్రా మహిళలు ప్రగతి పథాన నడుస్తున్నారు. ఇప్పటికే మహిళలు వివిధ రంగాల్లో వ్యాపారాలు చేస్తున్నారు. స్వయం ఉపాధి పొందుతున్నారు. వారికి మరింత తోడ్పాటు ఇచ్చే విధంగా వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్ పెన్యూయర్ విధానాన్ని వారికి వర్తింప చేసి మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందులో భాగంగా 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. వీటిల్లో వీలైనంత మేరకు మహిళలకు అవకాశం ఇస్తాం. డ్వాక్రా మహిళలకు బ్యాంకర్లు ఏ విధంగా సహకరించారో..

## ఏపీలో భారీ పెట్టుబడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడి వచ్చింది. రూ.95,000 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ఏర్పాటు చేసేందుకు ప్రముఖ బీపీసీఎల్ సంస్థ ముందుకు వచ్చింది. ఆయిల్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ మేరకు రామయపట్నం పోర్టు సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తోంది. దేశంలో ఆయిల్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా సామర్థ్యాన్ని పెంచేదిశగా బీపీసీఎల్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## అర్హులకే పెన్షన్లు: మంత్రి పార్థసారథి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దివ్యాంగులకు ప్రభుత్వం పెన్షన్ కట్ చేస్తోందంటూ రాష్ట్రంలో ప్రచారం జరుగుతోంది. ఇందుకు వైసీపీ నేతలు సైతం చేతులు కలిపారు. అనర్హత పేరుతో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం పెన్షన్లు కట్ చేసిందంటూ పలువురు వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో మంత్రి పార్థసారది స్పందించారు. పెన్షన్లపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత పాలనలో డబ్బులు తీసుకుని లబ్ధిదారులకు నకిలీ పెన్షన్ సర్టిఫికెట్లు ఇచ్చారని తెలిపారు. వెరిఫికేషన్ చేసి అర్హత ఉన్నవాళ్లకు పెన్షన్ ఇస్తామన్నారు. వైసీపీ నేతలు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## మద్యం కేసు నిందితులకు రిమాండ్ పొడిగింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఎపి మద్యం కేసులో నిందితులకు ఎసిబి కోర్టు వచ్చే నెల 9 వరకు రిమాండ్ పొడిగించింది. గతంలో విధించిన రిమాండ్ నేటితో ముగియడంతో సిట్ అధికారులు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో వైసిపి ఎంపీ మిథున్‌రెడ్డి రిమాండ్‌లో ఉన్నారు. విజయవాడ జిల్లా జైలులో 9 మంది నిందితులు, గుంటూరు జిల్లా కారాగారంలో ఇద్దరు ఉన్నారు.

## సృజనాత్మకతతో పనిచేయాలి

- ఆరోగ్య రంగంలో నవశకం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి
- ఆయన ఆలోచనలు, వేగాన్ని అందుకోవాలి
- అధికారులు దృక్పథాన్ని మార్చుకోవాలి
- సృజనాత్మకతతో పనిచేయాలి
- ఉన్నతాధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ హితవు
- సాధారణ బదిలీల తీరుపై హర్షం వ్యక్తం చేసిన మంత్రి
- మున్నెన్నడూ లేనివిధంగా బదిలీ ఆదేశాల్ని పాటించిన 99 శాతం ఉద్యోగులు





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఆరోగ్య రంగంలో నూతన శకాన్ని ఆవిష్కరించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం తపిస్తున్నారని, వైద్య శాఖ ఉద్యోగులు వైఖరిని మార్చుకుని ముఖ్యమంత్రి ఆలోచనలు, ఆధునికత, వేగానికనుగుణంగా పనిచేయాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ హితవు పలికారు.

మంగళవారంనాడు వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి పలు విషయాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సృజనాత్మకత, ఆధునిక సాంకేతిక విజ్ఞాన అవలంబన, ఆవిష్కరణల ఆధారంగా ప్రజారోగ్యాన్ని కొత్తపుంతలు తొక్కించడానికి అహర్నిశలూ కృషి చేస్తున్నారని మంత్రి అన్నారు. ఆయన బాటలో నడవడానికి ప్రభుత్వ వైద్యులు, ఇతర సహాయక సిబ్బంది కంకణబద్ధులు కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

**వైద్య సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకోవాలి :** తాము విధులు నిర్వహిస్తున్న తీరు ముఖ్యమంత్రి ఆశయాల సాధనకు తోడ్పడుతుందా లేదా అనే వైద్యులు, ఇతర సిబ్బంది ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకుసాగాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో అన్నారు. బండి నడుస్తోందిలే అన్న రీతిలో కాకుండా యావత్తు సిబ్బంది వినూత్నంగా ఆలోచించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

**ప్రజాసమస్యలపై తక్షణ స్పందన అవసరం :** ప్రజాప్రతినిధులు, సామాన్యులు మిగతా 2లో...


## రాష్ట్ర ప్రజల కల సాకారం

### అమరావతి ఓఆర్ఆర్ నిర్మాణానికి అడుగులు!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రజలు కలగా భావిస్తున్న బాహ్యవలయ రహదారి (ఓఆర్ఆర్) నిర్మాణానికి కార్యాచరణ దిశగా ప్రభుత్వ యంత్రాంగం అడుగులు వేస్తోంది. ఇప్పటికే జిల్లాలో నిర్మిత ప్రాంతానికి సంబంధించి కన్సల్టింగ్ సంస్థ ఇచ్చిన నివేదికల ఆధారంగా రెవెన్యూ యంత్రాంగం భూములను గుర్తించింది. గుర్తించిన సర్వే నంబర్లలో భూముల రిజిస్ట్రేషన్లను మిగతా 2లో...

## పల్లెలకూ త్రీ ఫేజ్ వెలుగులు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామాలకూ త్రీ ఫేజ్ ద్వారా అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు అడుగులు పడుతున్నాయి. దీని కోసం విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం-ఆర్‌డీఎస్ఎస్ కింద ఫీడర్ల విభజన, కొత్త ఫీడర్ల ఏర్పాటు పనులను డిస్కంలు చేపట్టాయి. దీంతో సాంకేతిక నష్టాలు 9.9 శాతం తగ్గుతాయని విద్యుత్ కొనుగోలు వ్యయంలో ఏటా రూ.851 కోట్లు అదా అవుతుందని అధికారులు తెలిపారు. ఒక కిలోమీటర్ ఫీడర్ విభజన పనులు, మిగతా 2లో...

## సంప్రదాయానికి ప్రతీక వినాయకచవితి



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ప్రజలకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వినాయక చతుర్థి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరిసేలా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటూ, ప్రజలంతా ఐకమత్యం, ఆనందంతో గణపతి నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. మన రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తూ, ప్రతి రైతు, ప్రతి కూలీ, ప్రతి కుటుంబం సంతోషంగా జీవించేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం, సమగ్ర అభివృద్ధి నెలకొనేలా ఈ పండుగ తోడ్పడాలని అన్నారు. ఈ వినాయక చవితి అందరి జీవితాల్లో ఆరోగ్యం, సంపదను నింపాలని మిగతా 2లో...

## మల్లవల్లిలో కొత్త వెలుగులు





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వైఎస్సార్సీపీ సర్కార్ నిర్వాకంతో అంధకారంలో మగ్గిన మల్లవల్లి పారిశ్రామికవాడలో కూటమి ప్రభుత్వం కొత్త వెలుగులు నింపింది. పరిశ్రమల ఊసే లేక పూర్తిగా నిర్వీర్యమైన కారిడార్‌ను గాడిన పెట్టింది. పారిపోయిన పారిశ్రామికవేత్తలు తిరిగి వచ్చి ఇండస్ట్రీస్ పెట్టడంతో ప్రాంతమంతా సందడి వాతావరణం నెలకొంది. ఉద్యోగాల కోసం వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్నచోటే ఉపాధి పొందుతున్నామంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కృష్ణా జిల్లాలోని మల్లవల్లి పారిశ్రామికవాడ అభివృద్ధిపై దృష్టి పెట్టింది. గత ప్రభుత్వంలో మల్లవల్లి నుంచి తరలి వెళ్లిపోయిన పారిశ్రామికవేత్తలతో అధికారులు అనేకసార్లు సమావేశాలు నిర్వహించి వారిని రప్పిస్తున్నారు. నిర్మాణాలు పూర్తయిన వాటిలో ఉత్పత్తి ప్రారంభించేలా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రత్యేక చొరవ చూపారు.

పరిశ్రమల స్థాపన కోసం 2018లోకి దరఖాస్తు చేసుకున్న వారిలో ఇప్పటికే 427 మంది పారిశ్రామికవేత్తలకు మల్లవల్లిలో లాటరీ ద్వారా ప్లాట్లు కేటాయించారు. ఇప్పటికే అశోక్ లేలాండ్ యూనిట్ ప్రారంభంకాగా మరికొన్ని పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లలోనూ పని జరుగుతోంది. మిగతా 2లో...

## రాజధాని పనులపై పర్యవేక్షణ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతి పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పెద్దఎత్తున సాగుతున్న ఈ పనుల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సీఆర్‌డీఏ ఏర్పాటు చేస్తుంది. పనులు సరైన సమయంలో పూర్తయ్యేలా చూసేందుకు ఈ కేంద్రం నుంచి నిరంతరం పర్యవేక్షిస్తారు. అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన తర్వాత నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. దాదాపు రూ.50 వేల కోట్లకుపైగా పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించడంతో ముమ్మరంగా సాగుతున్నాయి. పెద్దఎత్తున సాగుతున్న పనుల సక్రమ పర్యవేక్షణకు సీఆర్?డీఏ ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతోంది.

సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన రాయపూడి సమీపంలో నిర్మిస్తున్న సీఆర్?డీఏ నూతన కార్యాలయంలోని కింది అంతస్తులో ఇది రానుంది. దీనికి ఆసక్తి గల సంస్థల నుంచి సీఆర్డీఏ ఆర్ఎఫ్‌పీ పిలిచింది. ఎంపికైన సంస్థ కమాండ్ కంట్రోల్ కేంద్రం నిర్మాణంలో సాంకేతిక తోడ్పాటు, నిర్వహణను చూడాల్సి ఉంటుంది. సీఆర్?డీఏ, అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రాజధానిలో రహదారులు, భవనాలు, వరద నీటి నిర్వహణ, మిగతా 2లో...


## అసత్యాలకు వైసిపి అంబాసిడర్





**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అబద్ధాలకు, అసత్యాలకు వైసీపీ బ్రాండ్ అంబాసిడర్ అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. సీసాలో బిరడా బిగించి మూతపెట్టిన వైసిపి భూతాన్ని ఎవరు ముందు తెరుస్తారో వాళ్ళనే తినేస్తుంది అని రామానాయుడు అన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి గంభీరం మాటల్లో తప్ప చేతల్లో వుండదు.. మిగతా 2లో...

## పల్లెలకూ త్రీ ఫేజ్ వెలుగులు



(మొదటి పేజీ తరువాయి)

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ కొనుగోలు వ్యయంలో యూనిట్‌కు 4 పైసల చొప్పున ఆదా అవుతుందని లెక్కగట్టారు.

3 డిస్కంల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటుతో పాటు ఓవర్‌లోడ్ ఉన్నవాటితో కలిపి 5783 ఫీడర్ల విభజన పనులు డిస్కంలు నిర్వహిస్తున్నాయి. దీంతో వ్యవసాయానికి ఆఫ్-పీక్ వేళల్లో విద్యుత్ అందించి, పీక్ డిమాండ్ సమయంలో వినియోగాన్ని నియంత్రించొచ్చు. విద్యుత్ కొనుగోలు ఖర్చు తగ్గుతుంది. ఈ పనులకు డిస్కంలు సుమారు రూ.10 వేల కోట్లు వెచ్చిస్తున్నాయి. వ్యవసాయ కనెక్షన్లతో పాటు ఇతర వినియోగదారులకు విద్యుత్ సరఫరా అవుతున్న 4,845 ఫీడర్లను విభజిస్తున్నారు. తద్వారా గ్రామాల్లోని వినియోగదారులకు, అక్కడి చిన్న పరిశ్రమలకు అంతరాయం లేకుండా త్రీఫేజ్ విద్యుత్ అందించవచ్చని అధికారులు చెబ్నుతున్నారు. అదే సమయంలో వ్యవసాయానికి షెడ్యూల్ ప్రకారం కరెంటు ఇవ్వొచ్చు అని తెలిపారు.

40 నుంచి 50 శాతం పనులు పూర్తి: 11 కేవీ, 33 కేవీ ఫీడర్లపై అధిక లోడ్ కారణంగా తరచూ విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగి, సాంకేతిక నష్టాలు పెరుగుతున్నాయి. ఇలాంటి ఫీడర్లు 938 ఉన్నాయి. విద్యుత్ సరఫరాలో సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే 417 ఫీడర్ల విభజనను డిస్కంలు పూర్తిచేశాయి. మరో 173 ఫీడర్ల విభజన వివిధ దశల్లో ఉంది. ఇంకా 307 చోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఫీడర్ పరిధి తక్కువగా ఉంటే, లోడ్ పెరిగినప్పుడు వెంటనే గుర్తించి మౌలిక సదుపాయాలు కల్పించవచ్చని అధికారులు తెలిపారు.

వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ఎస్ పనులకు టెండర్లు పిలిచి, తర్వాత పట్టించుకోలేదు. దీంతో 3 డిస్కంలలో 20 నుంచి 30 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించే క్రమంలో ఆర్?డీఎస్?ఎస్? పనులపై దృష్టి పెట్టింది. గుత్తేదారులతో చర్చించి పనులను వేగవంతం చేసింది. ఇప్పటికే 40 నుంచి 50 శాతం పనులు పూర్తి అయ్యాయి. ఈ ఏడాదిలో మొత్తం పూర్తిచేయడంపై అధికారులు దృష్టిసారించారు.

## సంప్రదాయానికి ప్రతీక వినాయకచవితి

(మొదటి పేజీ తరువాయి)



ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతలకు ఈ పండుగ ప్రతీక అని, ప్రతి ఇంటి నుంచీ మొదలుకొని ప్రతి వీధి వరకు ఈ పండుగ ఆనందోత్సాహాలను పంచుతుందని అన్నారు. విఘ్నేశ్వరుడు శుభారంభాలకు సంకేతం, విజయానికి దారికొల్పే దేవుడని ప్రజలందరూ గణపతి ఆశీస్సులతో ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలియజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం గణపతి నిమజ్జనాన్ని పర్యావరణహితంగా జరుపుకోవాలని, భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించటం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అలాగే ప్రజలు సంతోషం, శాంతి, అభివృద్ధి, ఐశ్వర్యాలతో నిండిన కొత్త ఆరంభాలు సాధించాలని, విఘ్నేశ్వరుడు అందరికీ శక్తి, ధైర్యం ప్రసాదించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

## మల్లవల్లిలో కొత్త వెలుగులు




(మొదటి పేజీ తరువాయి)

పాత ధరకే ప్లాట్లు కేటాయించడంతో భారం తగ్గిందని పారిశ్రామికవేత్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగన్ హయాంలో పారిశ్రామికవాడను గాలికొదిలేయడంతో స్థానికులకు ఉపాధి గగనంగా మారింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మెరుగుపడ్డాయి. పరిశ్రమల నిర్మాణాలు ఊపందుకోవడం ఉత్పత్తి యూనిట్ల ప్రారంభంతో స్థానికులకు చేతినిండా పని దొరుకుతోంది. మల్లవల్లితో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని మహిళలు, యువతకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

'ఇంతకుముందు నేను పొలం పనికి వెళ్లేదాన్ని. కానీ ఇప్పుడు ఇక్కడ ఒక పరిశ్రమలో పని చేస్తున్నాను. నెలకు రూ.10 వేలు ఇస్తున్నారు. ఇక్కడున్న పలు పరిశ్రమలలో మా ఊరి మహిళలు చాలా మంది ఉపాధి పొందుతున్నారు. ఉపాధి పొందున్న వాళ్లలో చదువుకోని వాళ్లు, ఆర్థిక స్థోమత లేక మధ్యలో ఆపేసిన వాళ్లూ ఉన్నాం. మల్లవల్లి పారిశ్రామిక వాడలో అన్ని సౌకర్యాలూ బాగున్నాయి. మరిన్ని కంపెనీలు వస్తే ఇంకా వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయి.' – ఉపాధి పొందిన మహిళలు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మల్లవల్లిని ప్రగతి పథంలో నడిపిస్తున్నామని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. రోడ్లు, డ్రెయిన్, విద్యుత్, నీరు వంటి వసతులు కల్పిస్తున్నామన్నారు. మిగతా పరిశ్రమలు కూడా వస్తే మల్లవల్లి దశ మారుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## మట్టివినాయక ప్రతిమలను పూజిద్దాం

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెనాలి డిఎస్పి బి.జనార్దన్ రావు పేర్కొన్నారు.స్థానిక గంగానమ్మపేట సెంటర్లో మంగళవారం సాయంత్రం, శ్రీ హర్ష ట్రేడర్స్ వారి వితరణతో,మట్టి గణపతి ప్రతిమల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని, డీఎస్పీ బీ జనార్దన్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.

రెడ్ క్రాస్ తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి యు. భానుమతి పర్యవేక్షంలో మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ బి జనార్ధనలో మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు గణపతి సేవకులు తోడ్పడాలనే సంకల్పంతొ, నిర్వాహకులు ఉచిత మట్టివినాయక ప్రతిమలు పంపిణీ చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ జే ఎమ్ జె వింగ్, పాటి బండ్ల హేమలత వై దీపిక, ఏంజెల్, శివ పార్వతి, ఎస్ సాంబశివరావు, సుభాష్ చంద్రబోస్, కృష్ణ చైతన్య, నాళం శ్రీమన్నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యకు ఊతం





(మొదటి పేజీ తరువాయి)

దీనికి బ్యాంకర్లు సహకరించాలి." అని చంద్రబాబు చెప్పారు.

**ఇన్నోవేషన్ కేంద్రాలకు... బ్యాంకర్లు అనుసంధానమవ్వాలి :** యువత, మహిళ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేలా రాష్ట్రంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించాం. ఇప్పటికే అమరావతిలో ప్రధాన కేంద్రం పనిచేయడం మొదలైంది. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం, తిరుపతి వంటి చోట్ల ఐదు ప్రాంతీయ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే వీరికి నాలెడ్జ్, ఎడ్యుకేషన్ పార్టనర్లు ఉంటారు. దీనికి బ్యాంకర్ల నుంచి సహకారం ఉండాలి. ఫలితాలు వచ్చేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేయబోయే ఇన్నోవేషన్ హబ్ లకు ఆయా ప్రాంతాల్లో ఉండే బ్యాంకుల ప్రతినిధులను అనుసంధానించాలి. ఇది స్టార్టప్ లకు, నైపుణ్యాభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కొత్త ఆవిష్కరణలకు సహకారం అందించే దిశగా ఆలోచనలు చేయాలి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను, విదేశీ విద్యను అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. యువత భవిష్యత్తు బంగారుమయం కావాలంటే విద్యకు ప్రాధాన్యమివ్వాలి. నాణ్యమైన విద్యను అందించడంతోపాటు... ఉన్నత విద్య, విదేశీ విద్యను పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి తేవాలి. ఉన్నత విద్యకు సహకరించేలా బ్యాంకర్లు తమ వంతు పాత్ర పోషించాలి. తక్కువ వడ్డీలతో రుణాలివ్వడం.. తక్కువ మొత్తాలతో అప్పు తీర్చే వెసులుబాటు కలిగించాల్సిన అవసరం ఉంది." అని సీఎం వివరించారు.

**ప్రజల కోసం... పేదల కోసం... :** "బ్యాంకర్ల సమావేశాలు అర్థవంతంగా జరగాలి. ఫలితాలిచ్చేలా ఉండాలి. రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా నిర్ణయాలు ఉండాలి. రొటీన్ సమావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు. ఖరీఫ్ సీజన్లో ఇప్పటికే సగం సమయం గడిచిపోయింది. ఈ పాటికే రైతులకు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది. సీజన్ ఆఖరులో రుణాలు ఇవ్వటం వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. ప్రస్తుతం ప్రపంచం అంతా వేగంగా మారిపోతోంది. బ్యాంకర్లూ మారాలి. జీఎస్టీలో సంస్కరణల్ని కేంద్రం తీసుకువచ్చింది. నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ రిఫార్మ్స్ రావాలి. బ్యాంకులు, పబ్లిక్ పాలసీలు ఎప్పుడూ ప్రజల్ని నియంత్రించేలా కాకుండా... ప్రోత్సహించేలా ఉండాలి. అమెరికా, చైనా లాంటి దేశాలకు సవాలు విసిరేలా మన ఆర్థిక వ్యవస్థ తయారు అవుతోంది. ఫాల్స్ లెండింగ్ చేయాలని ఎవరూ సిఫార్సు చేయరు, ఉత్పాదకత లేని రుణాలు కూడా మంచివి కావు. పేదలు– ధనికుల మధ్య అంతరాలు తగ్గేందుకు అవసరమైన చర్యలనూ చేపట్టాలి. దీంట్లో భాగంగానే ప్రభుత్వం పీ4 కార్యక్రమం చేపట్టింది. ఇందులో బ్యాంకర్లూ భాగస్వాములు కావాలి." అని చంద్రబాబు చెప్పారు.

**రవాణా రంగానికి ఆసరాగా నిలవండి :** "రాష్ట్రంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగంగా చేపడుతున్నాం. పెద్ద ఎత్తున లాజిస్టిక్స్ ప్రాజెక్టులు తెచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. పోర్టులు, ఎయిర్ పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, అన్ని రకాల రవాణా సౌకర్యాలకు సంబంధించిన భారీ ప్రాజెక్టులు చేపట్టబోతున్నాం. దుగరాజపట్నం పోర్టు రాబోతోంది. కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం. ఏపీకి అతి పెద్ద తీర ప్రాంతం ఉంది. లాజిస్టిక్స్ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయి. లాజిస్టిక్స్ సౌకర్యాలను మరింత విస్తరించేందుకు లాజిస్టిక్స్ కార్పోరేషన్ ఏర్పాటు చేస్తున్నాం. లాజిస్టిక్స్ వ్యయం ప్రస్తుతం 14 శాతంగా ఉంది. లాజిస్టిక్స్ వ్యయం సింగిల్ డిజిట్ కు తగ్గించేలా ఇన్ఫ్రా ప్రాజెక్టులు రావాలి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయల కల్పనలో పీపీపీ పద్దతిలో పెద్ద ఎత్తున ప్రాజెక్టులు చేపట్టబోతున్నాం. అవసరమైతే దీనికి వయబులిటి గ్యాప్ ఫండింగ్ ఇస్తాం. దీనికి ఐఐఎఫ్సీఎల్ వంటి ఆర్థిక సంస్థలు, బ్యాంకర్లు సహకరించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఫండింగ్ ఇవ్వడానికి బ్యాంకులు ముందుకు రావాలి." అని సీఎం కోరారు.

**అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ :** "ఏపీ రాజధాని అమరావతిలో బ్యాంకులు తమ ప్రధాన కార్యాలయాలను ఏర్పాటు చేసుకోవాలి. బ్యాంకులన్నీ కలిసి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ను ఏర్పాటు చేయండి. క్వాంటం వ్యాలీ సేవల్ని కూడా వినియోగించుకోండి. ఆర్థిక లావాదేవీల భద్రత ఇప్పుడు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో క్వాంటం వ్యాలీ సేవలు ఉపకరిస్తాయి. అమరావతిలో ఐకానిక్ భవనాలు నిర్మించండి. బ్యాంకులకు అవసరమైన భూమిని కేటాయిస్తాం. రెండేళ్లలో అమరావతిలో బ్యాంకులు తమ కార్యాలయాలను నిర్మించాలి. బ్యాంకుల బ్యాక్ ఎండ్ సర్వీసులను ఇక్కడి నుంచే అందించాలి. అమరావతిలో రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు రుణాలిచ్చేందుకు బ్యాంకులు మందుకు రావాలి. వారిని ఎలాంటి ఇబ్బందులు పెట్టొద్దు." అని చంద్రబాబు సూచించారు.

**బడుగులకు అండగా ఉండాలి :** "కౌలు రైతులకు రుణాలివ్వాలి. బడుగులు అన్ని రకాలుగా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటారు. వారికి ఆర్థికపరమైన అండ కూడా తక్కువగా ఉంటుంది. అలాంటి వారికి ప్రభుత్వం అండగా ఉండడంతోపాటు.. బ్యాంకర్లు సహకరించాలి. బీసీ కార్పోరేషన్, ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ల ద్వారా రుణాల కోసం వచ్చే దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలి. పీఎం సూర్యఘర్ వంటి పథకాన్ని అత్యంత ప్రాధాన్యతాంశంగా గుర్తించాం. దీనికి ఎలాంటి ఇబ్బంది లేకుండా సహకరించాలి. సిబిల్ స్కోర్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని నిబంధనలు చెబుతున్నాయి. దీన్ని బ్యాంకర్లు పరిగణనలోకి తీసుకోవాలి. స్టార్టప్ ఇండియా, ముద్రా యోజన,పీఎంఈజీపీ, ఎఫ్ఎంఈ, స్వానిధి పథకాల్లో బడుగులకు ప్రాధాన్యమివ్వాలి."అని సీఎం కోరారు.

**వివిధ రంగాల్లో రుణాలిలా... :** 232వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో వివిధ రంగాలకు బ్యాంకర్లు ఇచ్చిన రుణాలను వివరించారు. పెట్టుకున్న లక్ష్యాలకు అనుగుణంగా ఎంత వరకు పురోగతి సాధించారనే అంశంపై సమీక్షించారు. మొత్తంగా వార్షిక రుణ ప్రణాళికలో భాగంగా అన్ని రంగాలకు కలిపి రూ. 2,47,919 కోట్ల మేర రుణాలను బ్యాంకులు ఇచ్చాయి. ఇందులో వ్యసాయ రంగానికి రూ.94,666 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.49,831 కోట్లు, ఇతర రంగాలకు రూ. 1,00,278 కోట్ల మేర రుణాలను ఇచ్చారు. దీంట్లో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులకు రూ.985 కోట్ల రుణాల్ని మంజూరు చేశారు. ఆర్థిక ప్రమాణాల విషయంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో బ్యాంకులు బాగా పని చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి నాగరాజు చెప్పారు.. సేద్యానికి ముందుగానే రైతులకు రుణ వితరణ జరగాలన్న సీఎం అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. మచిలీపట్నంలో ఆంధ్ర బ్యాంక్ వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో పార్కు, మెమోరియల్ ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వం రెండెకరాల భూమి కేటాయిస్తే ఆ పనులు పూర్తి చేస్తామని నాగరాజు ప్రకటించారు. ఈ సమావేశంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఎస్ఎల్బీసీ ఛైర్మన్ నితీష్ రంజన్, సీడ్బీ సీఎండీ మనోజ్ మిట్టల్, ఎగ్జిమ్ బ్యాంక్ ఎండీ హర్ష బంగారి, కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు, పంజాబ్ నేషనల్ ఎండీ అశోక్ చంద్ర, ఇండియన్ బ్యాంక్ ఎండీ బినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతతో పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)



పలు ప్రజాసమస్యల్ని తన దృష్టికి తెచ్చినప్పుడు వాటిని సంబంధిత అధికారులు శీఘ్రమే పరిశీలించి తగు సమాచారాన్ని అందజేయాలని, ఈ విషయంలో ఆలస్యం జరగడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాసమస్యల్ని పట్టించుకోకపోతే అది ప్రజాస్వామ్య ఉల్లంఘనకిందకు వస్తుందని, ఈ విషయంపై వైద్యులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు.

**సాధారణ బదిలీల తీరుపై మంత్రి హర్షం :** నేటి సమీక్షలో భాగంగా ఈ ఏడాది జూన్‌లో వైద్యారోగ్య శాఖ చేపట్టిన సాధారణ బదిలీల తీరు, ఫలితాలపై మంత్రి విభాగాధిపతులతో చర్చించారు. 7,200కు పైగా వైద్యులు, పాలనా సిబ్బందిని బదిలీ చేయగా వారిలో నిర్ణీత గడువులో 99 శాతం మంది కొత్త పోస్టింగ్ ల్లో చేరినట్లు ఉన్నతాధికారులు వివరించారు. నియమాల మేరకు వివాద రహితంగా భారీ స్థాయిలో సాధారణ బదిలీల ప్రక్రియను విజయవంతంగా ముగించినందుకు విభాగాధిపతులను, అధికారులను మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అభినందించారు. గతానికి భిన్నంగా వివాద రహితంగా బదిలీలు జరిగాయనడానికి 99 శాతం మంది ఉద్యోగులు బదిలీ ఆదేశాలను ఆమోదించడం నిదర్శనమని మంత్రి అన్నారు.

**ఖాళీలను భర్తీ చేయాలి :** విభాగాల వారీగా వివిధ స్థాయిల్లో మంజూరైన పోస్టులు, ఖాళీలను మంత్రి సమీక్షించారు. గతేడాది జూన్ నుండి వివిధ విభాగాలు చేపట్టిన నియామకాల వివరాలను మంత్రి తెలుసుకున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు అవసరమైన ఖాళీలను ప్రణాళికాబద్ధంగా భర్తీ చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఆయుష్, మందుల నియంత్రణ విభాగం, ఆహార పదార్థాల కల్తీ నిరోధక విభాగాల్లో భారీగా ఉన్న ఖాళీలను భర్తీ చేసి ఈ విభాగాలు సమర్ధవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

సృష్టి ఫెటిలిటీ సెంటర్ వ్యవహారంలో జిల్లాల్లో అధికారులు స్పందించిన తీరు సంతృప్తినివ్వలేదన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో మినహా మిగతా చోట్ల ఎక్కడా అధికారులెవరూ పట్టించుకోకపోవడం తగదని మంత్రి హితవు పలికారు. వాట్సప్ గవర్నెన్స్‌ను ఆసుపత్రుల్లో ప్రవేశపెట్టినట్లయితే రిపోర్టులు వెంటనే రోగులకు పంపించేందుకు సులువవుతుందని చెప్పారు. వైద్యారోగ్యశాఖలో క్రమంగా వినూత్న ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావాల్సిన అవసరముందన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, 10 విభాగాధిపతులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డిఎంఇకి వైద్యారోగ్య మంత్రి అభినందనలు**

ఈ నెలాఖరులన పదవీ విరమణ చేయనున్న వైద్య విద్య సంచాలకులు(డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) డాక్టర్ డియస్ వివి‌ఎల్ నరసింహను వైద్యారోగ్య శాఖామంత్రి ప్రశంసించారు. కీలకమైన డిఎంఇ పదవిలో డాక్టర్ నరసింహం వివాదరహితుడిగా పేరుగాంచారని, క్లిష్టతర బాధ్యతల్ని సమర్ధవంతంగా నిర్వహించారని మంత్రి అభినందించారు. అధికారంకోసం ఆరాటపడకుండా ప్రభుత్వం తనకిచ్చిన బాధ్యతల్ని చిత్తశుద్ధితో నిర్వహించారని మంత్రి అన్నారు. మంచి నిపుణుడైన సర్జన్ గా పేరుగాంచిన డాక్టర్ నరసింహం పదవీ విరమణానంతరం తన సేవల్ని ప్రజలకు అందించాలని మంత్రి ఆకాంక్షించారు.

## అసత్యాలకు వైసిపి అంబాసిడర్



(మొదటి పేజీ తరువాయి)

వచ్చే అసెంబ్లీ సమావేశాలకు హాజరు అవుతారని మేం అనుకోవడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలో ఉంటే ప్రైవేటీకరణ, ప్రతిపక్షంలో ఉంటే మొసలి కన్నీరే వైసీపీ విధానం అని ఆయన చెప్పుకొచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేట్ పరం కాదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం కాకుండా నాడు వాజపేయి హయాంలో రూ. 1333 కోట్లు ప్రత్యేక ప్యాకేజీ సాధించి కాపాడింది చంద్రబాబే. ఇక వైసీపీ హయాంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకర చేసేలా ప్రయత్నాలు జరిగితే వైసీపీ ఎంపీలు, నాయకులు నోరు మెదపలేదు అని మంత్రి నిమ్మల విమర్శించారు.

ఇక, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు రూ. 11 వేల కోట్ల నిధులు తీసుకొచ్చి, ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. వైసీపీ పాలనలో డీఎస్సీ, మెగా డీఎస్సీ అని ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయలేదు. ఐదేళ్ళలో ఒక్క టీచర్ భర్తీ లేకుండానే విద్యకు గుండు సున్నా చుట్టాడు జగన్.. నాడు అడ్డగోలు సిఫార్సులు, బదిలీల పేరుతో రూ. 50 కోట్లు వసూళ్లు చేశారు.. ఎన్నికల విధులనుండి టీచర్లను తప్పించే ప్రయత్నం చేశారు. రంగులు, టైల్స్, ఎలక్ట్రికల్, గార్డెనింగ్ వంటి కమీషన్లు వచ్చే పై పై పనులు చేసి నాడు, నేడు లో వేలకోట్లు దోచుకున్నారు. పూజించాల్సిన గురువులను, వైన్ షాపుల దగ్గర కాపలా పెట్టారు. మరుగు దొడ్లను కడిగించారని నిమ్మల రామానాయుడు చెప్పుకొచ్చారు.

అయితే, డీఎస్సీ అంటేనే చంద్రబాబు.. చంద్రబాబు అంటేనే డీఎస్సీ.. దేశంలో రికార్డు స్థాయిలో 2 లక్షల టీచర్ పోస్టులు భర్తీ చేసిన ఘనత చంద్రబాబుదే అని మంత్రి రామానాయుడు వెల్లడించారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ విడుదల చేసి 16, 347 పోస్టులు భర్తీ చేస్తున్నాం.. ప్రైవేట్ స్కూల్స్ కి ధీటుగా పిల్లలకు నాణ్యమైన షూస్, బ్యాగులు, యూనిఫామ్ వంటి కిట్లు అందించడంతో పాటు మధ్యాహ్నం సన్నరకం బియ్యంతో భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు.

## రాజధాని పనులపై పర్యవేక్షణ

(మొదటి పేజీ తరువాయి)

రైతుల రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన, పచ్చదనం అభివృద్ధి, తదితర పనులు సాగుతున్నాయి. ఒకేసారి భారీ ఎత్తున జరుగుతున్న పనులు సరైన సమయంలో పూర్తయ్యేలా చూసేందుకు, వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

360 డిగ్రీల్లో పరిశీలించేందుకు డ్రోన్ల సాయం: ఇక్కడ అంశాల వారీగా ప్రత్యేకంగా సిబ్బందికి బాధ్యతలు అప్పగించనున్నారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో నాణ్యమైన చిత్రాలు అందించే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తారు. వీటి నుంచి వచ్చే దృశ్యాలను సీఆర్?డీఏ ప్రధాన కార్యాలయంలోని వ్యవస్థతో అనుసంధానం చేస్తారు. వీటితోపాటు ఎంచుకున్న పని ప్రాంతాన్ని 360 డిగ్రీల్లో పరిశీలించేందుకు డ్రోన్ల సాయం తీసుకోనున్నారు. ఇవి చిత్రీకరించే దృశ్యాలను రియల్ టైం మానిటరింగ్ ద్వారా పరిశీలించనున్నారు. ప్రత్యేక డ్యాష్ బోర్డును నిపుణులతో సీఆర్డీఏ అధికారులు రూపొందిస్తున్నారు.

పురపాలక మంత్రి, సీఆర్డీఏ కమిషనర్, ఏడీసీఎల్ సీఎండీ, ఆయా విభాగాధిపతులు, కింది స్థాయి అధికారులకు డ్యాష్‌బోర్డులో లాగిన్ అయ్యేలా ఐడీ ఇవ్వనున్నారు. ఈ కేంద్రంలో నిరంతరం పనుల తీరు సమీక్షిస్తారు. అధికారులు, గుత్తేదారులు, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ల మధ్య సమన్వయంతో పనుల్లో వేగం, నాణ్యత పెరుగుతుందని భావిస్తున్నారు. నిరంతరం క్షేత్రం నుంచి వచ్చే ఇన్‌పుట్స్‌తో విశ్లేషణ చేసి పనుల భౌతిక పురోగతి, భద్రతాపరమైన చర్యలు, ఇబ్బందులు వంటి అంశాలపై నిత్యం, వార, పక్ష, నెలవారీ నివేదికలను ఇక్కడి సిబ్బంది తయారు చేస్తారు.

# రాష్ట్ర ప్రజల కల సాకారం

(మొదటి పేజీ తరువాయి)



నిలిపి వేయాలంటూ జిల్లా అధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయికి అందజేయడంతో ఓఆర్ఆర్ నిర్మాణంపై ఒకవైపు ప్రజల్లో ఆశలు చిగురిస్తుంటే, మరోవైపు బహిరంగ మార్కెట్లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

స్వల్ప మార్పులు,చేర్పులతో: గత టీటీపీ హయాంలో రాజధాని అమరావతి చుట్టూ నిర్మించే ఔటర్ రింగ్ రోడ్డు కోసం భూములను నిర్ధారించారు. అప్పట్లోనే చాలా వరకు సర్వే నంబర్లను గుర్తించి, రిజర్వు చేయగా, ఆ తర్వాత వైఎస్సార్సీపీ అధికారంలోకి రావడంతో నిర్మాణం అనేది కలగానే మిగిలిపోయింది. తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంతో గతంలోని నివేదికల్లో స్వల్ప మార్పులు, చేర్పులతో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయి భూముల జాబితాలను సిద్ధం చేసింది. జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కాంపిటేట్ అథారిటీగా నియమిం చింది.

నాలాలు చెల్లించొద్దు: జిల్లాలో నాలుగు మండలాల పరిధిలో రహదారి నిర్మించ నుండగా ఆయా ప్రాంతాల్లో సుమారు వెయ్యి మందికి పైగా రైతుల నుంచి భూమిని సేకరించనున్నారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లోని భూముల రిజిస్ట్రేషన్ల ధరలు నిర్ణయించి ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే గుర్తించిన సర్వే నంబర్లలో లేఔట్ల కోసం, ఎటువంటి నాలా (భూ వినియోగ మార్పిడి రుసుం)లను చెల్లించుకోవద్దని గత నెలాఖరులోనే జేసీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ మండలాల్లోనే: గుర్తించిన సర్వే నంబర్లను జేసీ ద్వారా జిల్లా రిజిస్ట్రార్‌కు, విజయవాడ, నందిగామ ఆర్డీవోలకు జాబితాలను పంపారు. వాటికి రిజిస్ట్రేషన్లను ఆపాలని ఆదేశించడంతో పాటు ఆయా మండలాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు జాబితాలు చేరాయి. భూ సేకరణ సమయంలో ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా 500 మీటర్ల వెడల్పున రిజిస్ట్రేషన్లు నిలిపేస్తూ ఆదేశాలు ఇచ్చారు. మైలవరం మండలంలో మైలవరం, పొందుగల, జి.కొండూరులో దుగ్గిరాలపాడు, పేట్రంపాడు, కుంటముక్కల, చిన నందిగామ, కోడూరు, వీరులపాడు పరిధిలో గూడెం మాధవరం, చెన్నారావుపాలెం, జుజ్జూరు, జగన్నాథపురం, పొన్నవరం, కంచికచర్ల మండలంలో కునికినపాడు, మోగులూరు, మున్నలూరు, పేరకలపాడు, కంచికచర్లలో భూ సేకరణ చేయనున్నారు.

**జిల్లాలో ఇలా:**

ఓఆర్ఆర్ నిర్మించే మండలాలు: 4

భూ సేకరణ గ్రామాలు: 18

రెవెన్యూ డివిజన్లు: 2

ప్రతిపాదనలు: 3093.54 ఎకరాలు

మరోవైపు ఏపీ రాజధాని అమరావతి ఔటర్ రింగ్? రోడ్డు వెంబడి హైటెక్? సిటీని ఏర్పాటు చేయాలనుకుంది. దానిలోనే ఏఐ, సెమీ కండక్టర్లతో పాటు ఇతర హైటెక్ ఇండస్ట్రియల్ హబ్?లు అభివృద్ధి చేయాలని టాస్క్?ఫోర్స్ సూచించింది. అయితే 'స్వర్ణాంధ్ర ప్రదేశ్ – 2047 లక్ష్యసాధన దిశగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి' అన్న అంశంపై దేశంలోని అగ్రశ్రేణి పారిశ్రామిక దిగ్గజాలతో టాస్క్?ఫోర్స్ ఏర్పాటైన విషయం తెలిసిందే. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, డ్రోన్స్ రంగాల్లో ఏపీ ప్రత్యేకదృష్టి పెట్టాలని, దాని కోసం తిరుపతి జిల్లాలో 'శ్రీ సిటీ' తరహాలో రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.

# దండాలయ్యా.. ఉండ్రాలయ్యా



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గణనాథుడు జానపదుల దేవుడు, తలపెట్టిన పనులన్నిటినీ ముందుండి విజయవంతంగా నడిపిస్తాడని గణపయ్య మీద తిరుగులేని నమ్మకం. చవితి పూజలు అందుకోవడానికి వినాయకుడు భూమ్మీదకు రావడంలోనే ఒక ప్రత్యేకత ఉంది. ఆయన జనసామాన్యుల దేవుడు.

జగజ్జనని చేతుల్లో చిట్టిపొట్టి 'బొమ్మగా గణపతి నలుగుపిండితో రూపుదిద్దుకున్నాడు. తల్లి అప్పగించిన బాధ్యతని నిర్భయంగా నిక్కచ్చిగా నిర్వహించాడు. పీకల మీదకు తెచ్చుకున్నాడు. మహాదేవుడు తను ఎరగకపోయి చేసిన పొరపాటుకి పశ్చాత్తాపపడ్డాడు. గజాసురుడి తలతో ఆ బాలుడికి తిరిగి జీవంపోశాడు. ఆ విధంగా ఆదిదంపతులిద్దరి చేతుల మీదుగా ఆవిర్భవించిన అద్భుతం మహాగణపతి. అనాది పుట్టుపూర్వోత్తరాలున్న దేవుడు ఈయన అనంతరం సమస్త విఘ్నాలకు రాజును చేశాడు తండ్రి మహాశివుడు. పెళ్లయినా, పేరంటమైనా, సంబరమైనా, సమరమైనా మొదట ఆ దేవరని పూజించి మొక్కులు తీర్చాల్సిందే. దేవుడి వ్రతమైనాలి లిఏ దేవత నోమైనా మొదట పసుపు, వినాయకుణ్ణి అర్చించ వలసిందే. పార్వతీ తనయుడు జానపదులకు హితుడయ్యాడు. సన్నిహితుడయ్యాడు. - గణపయ్య నిరాడంబరత గొప్ప గొప్ప చదువులెరగని శ్రమజీవులకు స్ఫూర్తిగానిలిచింది. అందము లేదు. ఐశ్వర్యము లేదు. ఆజానబాహుడు అసలే కాదు. అయినా మాకు ఈ దేవుడే కావాలని ఎంచుకున్నది జనసామాన్యం సామాన్యులు దండిగా సమర్పించగల పత్రితో మురిసి ప్రసన్నుడయ్యే గణపయ్య జానపదుల నిష్కల్మష హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. విఘ్నాలకు రాజు అంటే పరోక్షంగా విజయాలన్నీ ఆయన కనుసైగల్లో ఉన్నట్లే! మహా సామ్రాజ్యాన్ని గెలిపించాలంటే ఆయన చేతులోనే ఉంది. వజ్రాల గనికి అతి దగ్గరి దారి చూపాలన్నా ఆయన చేతుల్లోనే ఉంది. ఎక్కడా అడ్డుపడకుండా సమస్త విద్యలు పూర్తి చేసుకోవాలంటే గణపయ్య దయ ఉంటే చాలు. అంతేకాదు. మానవాళి ఆరోగ్యానికి నిత్యం అవసరమయ్యే మూలధాతువుల్ని అందించే వన సంపద విఘ్నరాజుకి ప్రీతిపాత్రమైన పూజాద్రవ్యమైంది. ఆయనను స్మరిస్తూ పచ్చని గరికను సమర్పిస్తే చాలు ఆ దేవుడు పొంగిపోతాడు. కోరినవే కాదు, కోరని వరాలు సైతం కురిపిస్తాడు. అందుకే ఆయన ప్రజల దేవుడిగా నాటి నించి నేటిదాకా పూజలందుకుంటున్నాడు. ప్రజలు ఆర్భాటాలకంటే సాదాసీదాతనాల్ని ఎక్కువ గౌరవిస్తారు. విఘ్నరాజుని సదా సేవించే అనిందియుడు అనే ఎలుక దేవుడంత ప్రాచుర్యం పొందింది. 'మూషిక వాహన గజాననా! మా ఊరి దేవుడా మహానా' అంటూ గ్రామీణులు భజనలు చేస్తారు. విఘ్నపతి పిల్లల దేవుడు. వినాయకుడి పండగ వచ్చిందంటే పిల్లలు నిద్రపోరు. పత్రి పూలు సేకరణలో తలమునకలవుతారు. సాటివారితో పోటీలు పడతారు. అనేకానేక పాటలు పద్యాలు తమ ముద్దుమాటలతో పాడి దేవుణ్ణి ఆనందపెడతారు. మహాతల్లి నలుగులోంచి ఆవిర్భవించిన మహాగణపతి యుగాలు మారినా నేటికీ గుప్పెడు బంకమట్టితోనే సిద్ధమై, చవితి పూజకు వేంచేస్తాడు. కుడుములు, ఉండ్రాళ్లు పెడితే కడుపార ఇష్టంగా తింటాడు. సామాన్య రైతు సైతం తన నేలలో పండిన దినుసులతో ఆ నైవేద్యాలు శ్రమ లేకుండా సమర్పించ గలడు. పూజ తర్వాత నిర్మాల్యం అతి తేలికగా నేలలో కలిసి సత్తువగా మారుతుంది. దేవుడు తిరిగి మట్టిలో ఒదిగిపోతాడు. పర్యావరణానికి మేలు తప్ప రవ్వంత కీడు జరగదు. ఏటా ఒకసారి పూజ జరిపించుకుని తన పత్రి ద్వారా ఆరోగ్య సూత్రాలను అందరికీ గుర్తు చేస్తాడు. సమస్త విద్యలకూ ఆరంభ శ్లోకం వినాయకుడు. అన్ని కళలకూ నాంది విఘ్నేశ్వరుడు. జన సామాన్యం భయభక్తులతోనే చనువు తీసుకుని ఈ దేవుడికి దగ్గరవుతారు. ఓ బొజ్జగణపయ్య అంటూ సంబోధిస్తారు. వినాయక చవితికి ప్రతి ఇల్లూ వినాయక మందిరం అవుతుంది. పిన్నలు, పెద్దలు 'శివ శివ మూర్తివి గణనాథా! నువు శివుని కుమారునివి గణనాథా!' అంటూ చిందులేస్తూ భజన పాటలు పాడతారు. తొమ్మిది రాత్రిళ్ల ఉత్సవం అత్యంత వైభవంగా మన నేలన సాగుతుంది. వినాయకుడి మట్టి బొమ్మని పాలవెల్లి నీడన పెడతారు. ఆకులతో, పూలతో, పళ్లతో పాలవెల్లిని అలంకరిస్తారు. ఒకనాడు పల్లెల్లో జోడెడ్ల బండిని కాడి దింపి బండి చట్రాన్ని పాలవెల్లిని చేసి అలంకరించి ఆ నీడన వినాయకుణ్ణి ప్రతిష్టించి పూజించేవారు. ఆరుగాలం కష్టించి పనిచేసే రైతుల దేవుడు గణపయ్య సకాలంలో వర్షం కావాలన్నా ఆయన దయే. అకాలంలో వానలు వద్దనుకున్నా ఆయన దయే మన మనసులో మాటకు సదా దన్నుగా వుంటాడని నమ్మిక, విశ్వాసం.

**పసుపు వినాయకుడు..... :** మన దేవతలందరిలోనూ గణపతిని మాత్రమే మహాగణపతి అని పిలుస్తాం. మహాగణపతి అంటే గొప్ప గణపతి, విశేషమైన గణపతి అని అర్థం. ప్రతి సంవత్సరం మనం పూజించే గణపతికి సైతం పూజనీయుడైన గణపతియే మహాగణపతి. ఆయనను మనం పసుపు ముద్దగా రూపొందించి పూజిస్తాం. గణం అంటే ఒక సమూహం. గణనాయకులందరికీ నాయకుడే గణపతి! వినాయక చతుర్థినాడు మనం వరసిద్ధి వినాయకునికి పూజలు జరుపుతాం. అయితే అలాంటి గణపతికి కూడా ప్రభువైన వాడు మహాగణపతి. ఆయనకంటే అధికులు ఎవ్వరూ లేరు. ఆ మహాగణపతినే మనం పసుపు విఘ్నేశ్వరునిగా పూజిస్తాం. శివుడు మహాగణపతిని పూజించాడు. ఆయన అనుగ్రహంతోనే త్రిపుర దహనం చేశాడు. ఆనాడు గణపతిని అర్చించకపోతే శివుని ప్రయత్నాలు సైతం వ్యర్థమైపోయేవి. శ్రీహరి వామనావతారం దాల్చినప్పుడు గణపతిని పూజించాడు. సృష్టి ప్రారంభంలో బ్రహ్మసైతం ఆయనను ధ్యానించాడు... దాంతో ఆటంకాలు తొలగి సృష్టి నిలబడింది.లి లిమహిషాసుర సంహారానికి ముందు జగదంబ సైతం గణపతిని ధ్యానించింది. మునిజనం మొదట తపస్సు ద్వారా అష్టసిద్ధులు పొందుతారు. వాటి ఆకరణలో పడవారెవ్వరూ మోక్షాన్ని పొందలేరు. వాటి ప్రదర్శనలో దిగజారిపోతారు. అప్పుడు మహాగణపతిని ధ్యానిస్తే ఆటంకాలు తొలిగి ముక్తిని పొందగలుగుతారు. ఆటంకాలను పరిహరించేది గణపతియే.అసలు దేవుడు ఒక్కడే, ఆయనే పరబ్రహ్మ, ఆయన్నే మనం వేరువేరుగా రూపాలు కల్పించుకుని వరసిద్ధి గణపతిగా, విద్యాగణపతిగా, పతిగా, లక్ష్మీగణపతిగా ఇలా వేరువేరుగా పూజలు చేస్తున్నాం.త్రిమూర్తులంటున్నాం. త్రిశక్తులంటున్నాం వీరంతా ఆయా కార్య సిద్ధుల కోసం కల్పించబడవారే. మాఘంలో సూర్యునిగా, దసరాల్లో అమ్మవారిగా, కార్తికంలో శివకేశవులుగా, భాద్రపదంలో గణపతిగా ఆయనొక్కడే వేర్వేరు ఉపాసనలు పొందుతున్నాడు. ఇవన్నీ సగుణ రూపాలు. అంటే కన్నూ ముక్కు వంటి అవయవాలు ధరించిన మూర్తులు. అయినా ఉన్నది ఒక్కటే. దాన్నే మనం ఈ మాయా జగత్తులో అనేకంగా చూస్తున్నాం. నిజానికి అనేకం లేనే లేవు. అద్దాల గదిలో నిలబడితే మనం అనేక రూపాలతో కనబడతాం. కానీ మనం ఒక్కరమే అవన్నీ మన ప్రతిబింబాలేనని మనకు తెలుసు. వాటికి బొట్టు పెట్టాలంటే అన్నింటికీ పెట్టనవసరం మూర్తు లందరికీ పెట్టినట్టు అవుతుంది. కదా! వినాయకుణి పూజించడం కూడా అలాంటిదే. ఏనుగు తల, పెద్దపొట్ట, ఎలుక వాహనం, పాలవెల్లి ఇవన్నీ మనం కల్పించుకుంటున్నాం. అలాంటి కల్పనలో కూడా మనం చిత్తశుద్ధితో పూజిస్తే ఇవన్నీ ఆ మూల స్వరూపానికి చెందుతాయి. అలా అని ఈ గణపతుల పూజే ప్రధానం అని భావించకూడదు. మనం నిరుణ గణపతినే అంటే పరబ్రహ్మనే తొలిసారిగా అర్చించాలి. తల్లికి భోజనం పెట్టకుండా ఊరంతా సంతర్పణ చేసినా ఎలా ఫలితం లేదో అలానే నిరుణారాధన లేకుండా సగుణారాధన చేసినా ఆశించిన ప్రయోజనం సిద్ధించదు. అయితే ఎలా.? అందుకే ముందు పసుపు గణపతిని అర్చించడం ఆచారంగా చేశారు పెద్దలు. పసుపును ఒక గుండ్రని ముద్దగా చేసి ఏ పూజకైనా మనం మొట్టమొదటగా అర్చిస్తున్నాం. ఆ ముద్దకు అవయవాలుండవు. ఏనుగుతల ఉండదు. ఎలుక ఉండదు. అంతేకాదు నైవేద్యం కూడా. సరైన రూపం లేని బెల్లం ముక్కనే పెడతాం. ఇంట్లో ఏ శుభ కార్యక్రమం చేసుకున్నా ఈ పసుపు గణపతి పూజ చేయాల్సిందే. శుభకార్యాలకు మీదుకట్టడం కూడా మహాగణపతిని ఉద్దేశించి చేసేదే.

ఆఖరుకి వినాయక చవితి నాడు ఎంత ఖర్చుపెట్టి పెద్ద గణపతుల్ని ప్రతిష్ఠించినా ఈ హరిద్రాగణపతే అందరికీ మూలకారకుడు. ఆ నిర్గుణతత్త్వాన్నే వేదం కీర్తించింది. అన్ని గణాలకు ఆయనే ప్రధానం. కవులకే కవీశ్వరుడు స్వామి. ఆ స్వామికి మరొక పోల్చదగిన దైవం లేదు. అందరు దేవతలకు జ్యేష్ఠుడు. మహాగణపతియే ప్రధాన దైవం. ఆయన వల్లే వేదాలు వచ్చాయి. కనుక ఆయనే వేదగణాలకూ ప్రభువు. ఈ తత్త్వం తెలుసుకోగలగడమే ఒక అదృష్టం.

**21 పత్రాలతో పూజ..... :** ఏ పూజ ప్రారంభించినా మొదట విఘ్నేశ్వరుడిని ఆరాధించడం ఆనవాయితీ. ప్రతి దేవతా పూజకు ముందుగా గణపతిని పూజిస్తాం. ఈ రోజు వినాయక చవితి. వినాయకుడిని ఎన్ని రకాల పుష్పాలతో పూజించినా ఆయన పూజలో 21 పత్రాలు వుండాలి. ఈ రోజు ప్రత్యేకంగా అన్ని 21 పత్రాలతో పూజించడంలో ఎన్నో ఆరోగ్య సూత్రాలున్నాయి.

## మట్టి గణపతిని పూజిద్దాం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** పర్యావరణ హితమైన మట్టి గణపతిని పూజిద్దామని, సంప్రదాయ పూజ విధానాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని సినీ హీరో శ్రీకాంత్ పేర్కొన్నారు. మట్టి గణపతుల ప్రచారం లో భాగంగా మంగళవారం ఫిల్మ్ నగర్ లో శ్రీకాంత్ ఇంటికి వెళ్లి సామాజిక కార్యకర్త పుట్టా రామకృష్ణ ఆధ్వర్యం లో శ్రీకృష్ణ నగర్ శ్రీవాస్తవ యువజన సంఘం సభ్యులు సినీ హీరో శ్రీకాంత్ కి మట్టి గణపతి అందజేశారు. మట్టి గణపతి ఇంటికి రావడం చాలా సంతోషం గా ఉందని, గత 2-3 సంవత్సరాలుగా వినాయక మట్టి విగ్రహం అందుకున్నట్టు పేర్కొన్నారు. మట్టి గణపతి ప్రచారం పై అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరు మట్టి గణపతిని పూజించాలని, ఇది ఒక మంచి సేవా కార్యక్రమం. అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సోషల్ వర్కర్ పుట్టా రామకృష్ణ, సూర్య రావు, బుజ్జి, రాజారావు, వెంకట్రావు, శ్రీనివాస్ రావు, సర్వరావు, రాజేష్, యతి రాజ్, మహేష్ , రాజా, నవీన్, సాయి, జగన్, కిరణ్, నిరంజన్రం, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగ చోరీ దొంగలు అరెస్టు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** బృందంగా సంచరిస్తూ చోరీలకు పాల్పడుతున్న దొంగలను కాకుమాను మండలం పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కాకుమాను స్టేషన్ ఎస్ ఐ ఫృధ్వి.ఏక్ నాథ్ మాట్లాడుతూ

ఇదే క్రమంలో మండల కేంద్రం అయిన కాకుమాను గ్రామంలో ప్రసాద్ అగ్రి టెక్ ఇన్నోవేషన్ సెంటర్ నందు ఈ నెల 5 వ తేదీన అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దొంగలు తాళాలు పగులగొట్టి అందులో గల 12 విద్యుత్ తీగల చుట్టలను దొంగిలించుకువెళ్ళినట్లు కంపెనీ సూపర్ వైజర్ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గుంటూరు సౌత్ డి యస్ పి జి.భానోదయ పర్యవేక్షణలో ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కాకుమాను యస్ ఐ ఏక్ నాథ్ తన బృందంతో దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. ఇదే క్రమం లో ముద్దాయిలు 26 వ తేదీన 12 విద్యుత్ తీగలు చుట్టలను అమ్ముకొనుటకు ఏ పి 07 టీ హెచ్ 1948 నెంబర్ గల ఆటో లో బాపట్ల టౌన్ సమీపంలో డంపింగ్ యార్డ్ వద్ద అనుమానాస్పదంగా ఉండగా తాము ముద్దాయిలు ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ముద్దాయిలు ఏలూరి. రాజేష్ (పిన్నబోయినవారి పాలెం),బొలగాని. వెంకట రావు(పిన్నబోయిన వారి పాలెం), కొమరగిరి .సుబ్బారావు(పిన్నబోయినా వారి పాలెం), కోమరగిరి. సంజీవరావు(చిరాల) కొమరగిరి. రవి (సింగరాయ కొండ),కల్లూరి యేసోబు (పాత నందాయపాలెం), కొమరాగిరి. మల్లీశ్వరి(పిన్నబోయినవారి పాలెం) అను వేరు ఇళ్లలో పాచి పనులు, కూలి పనులు చేసుకుంటూ చెడు అలవాట్లకు బానిసలై దొంగతనాలు చేసి డబ్బులు సంపాదించాలని ఏదైనా ఇంటిలో దొంగతనం చేద్దామని ఈ నెల 5 వ తేదీన రాత్రి సమయంలో అందరూ కలిసి బాపట్ల నుండి ఆటో లో కాకుమాను వచ్చి పొన్నూరు వైపు వెళ్తూ ఉండగా రోడ్ మార్గంలో నిర్మాణాల్లో ఉన్న కంపెనీ ను గమనించి ఎవరు లేరని నిర్ధారించుకుని ఇనుప రాడ్ లతో తాళాలు పగులగొట్టి లోపల ఉన్న 13 చుట్టల విద్యుత్ తీగలను దొగిలించుకొని వెళ్లారన్నారు. వీరి వద్ద నుండి 12 చుట్టల విద్యుత్ తీగ,నెరమునకు ఉపయోగించిన ఆటో ను సీజ్ చేసినట్లు తెలిపారు. ముద్దాయిలు ను అరెస్టు చేసి కోర్టు లో హాజరు పరచనున్నట్లు తెలిపారు. చాకచక్యంగా దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బంది కి మండల ప్రజలు అభినందనలు తెలిపినారు.

## వడ్డెరుల నాయకులతో ఆత్మీయ సమావేశం

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మంగళవారం వడ్డెర నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ వడ్డెరుల సంక్షేమం కోసం చేపట్టిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎమ్మెల్యే గళ్ళా స్పష్టంగా వివరించారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... "ప్రతి వడ్డెర కుటుంబం ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు పొందేలా ప్రభుత్వం నిరంతర కృషి చేస్తోంది. వడ్డెరుల సంక్షేమం, అభివృద్ధిని ప్రతి దశలో ముందుగా ఉంచడం తెలుగుదేశం పార్టీ ధ్యేయం. వడ్డెరుల అభ్యున్నతే పార్టీ అభివృద్ధి భావజాలానికి ప్రతీక" అని పేర్కొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వడ్డెరుల కోసం గృహాలు, విద్యా వసతులు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పథకాలు అమలు చేసింది. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చి వడ్డెరుల సమాజాన్ని సామాజిక, ఆర్థికంగా బలోపేతం చేస్తాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో



వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర్ రావు, చంద్రగిరి బాబు, చెంబేటి మణికుమారీ, బత్తుల జాన్ సైదా, ఓర్స్ శ్రీను, బుజ్జి మేస్త్రి, పల్లెపు శివ మరియు పార్టీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో చిరువ్యాపారులకు మంత్రి నారా లోకేష్ చేయూత

**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి నియోజకవర్గంలో చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి మంత్రి నారా లోకేష్ ఎంతో కృషి చేస్తున్నారని మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్ అన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో మంగళగిరి పట్టణం, మంగళగిరి రూరల్ మండలాలకు చెందిన పలువురికి బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలను మంగళవారం అందజేశారు. మంగళగిరి పట్టణంలోని 29వ వార్డుకు చెందిన షేక్ మస్తానికి బడ్డీకొట్టు, 3వ వార్డుకు చెందిన జంజనం లక్ష్మికి, భార్గవ్‌పేటకు చెందిన చింతక్రింది దుర్గరావు, మంగళగిరి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఆకురాతి ఉమామేరీకి టిఫిన్ బళ్లు, 19వ వార్డుకు చెందిన పందెటి వెంకటేశ్వరమ్మకు, 30వ వార్డుకు చెందిన మైలా సాంబయ్యకు తోపుడు బళ్లు, 28వ వార్డుకు చెందిన మరగానికి వెంకటేశ్వరరావుకు ప్లాట్ ఫామ్ రిక్షా అందజేశారు. త?మ కుటుంబ జీవనోపాధికి అవసరమైన బడ్డీకొట్టులు, టిఫిన్, తోపుడు బళ్లు, ప్లాట్ ఫామ్ రిక్షాలు అందజేయాలని మంత్రి నారా లోకేష్‌ని కోరగా వెంటనే స్పందించిన ఆయన వెంటనే బళ్లు తయారు చేయించి నాయకుల చేతుల మీదుగా అందజేయించారు. ఈ సందర్భంగా పడవల మహేష్ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ చేయూత అందిస్తూనే ఉంటున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం



మంత్రి నారా లోకేష్ చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమోఘం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,షేక్ ఖదీర్ బాషా (బుజ్జి )డిడ్ల సత్యానందం, పేరం ఏడుకొండలు,వంగర హనుమాన్,చెల్లూరి సత్యన్నారాయణ, భైరబోయిన శ్రీనివాసరావు, భైరబోయిన శివశంకర్,తురక వీర శేఖర్, యుద్ధం అప్పారావు,ఎండీ ఆరిఫ్,తోట కరుణ కుమార్,కోలా శ్రీనివాసరావు, రజియా బేగం, పసుపులేటి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు

## దారుణమైన ధరలతో పొగాకు కొనుగోళ్లు

**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** పొగాకు కొనుగోళ్లు మే నెల వరకు జరగాల్సి ఉండగా ఇప్పటికీ తాము పండించిన పొగాకును పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. ఒక్కోరైతు నుంచి కేవలం 20 క్వింటాళ్లే మార్క్ ఫెడ్ ద్వారా కొనాలని ప్రభుత్వం ఆదేశించడంతో మిగిలిన పొగాకు ఏమి చేయాలని వారు వాపోతున్నారు.

నిల్వ సదుపాయాలు లేక నాణ్యత దెబ్బతింటోంది. వర్షాలకు కొంత పొగాకు పాడైంది. కాకుమాను, పెదకాకాని గోడౌన్లకు తరలించడానికి రవాణా ఖర్చులు పెరిగినప్పటికీ, నాణ్యత లేదని కొన్ని చెక్కులు వెనక్కు పంపిస్తున్నారు. మార్క్ ఫెడ్ ద్వారా తొలుత క్వింటాలుకు రూ. 12 వేలు చొప్పున ఇచ్చినప్పటికీ ప్రస్తుతం రూ. 6 వేల నుంచి 3 వేలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా చేపట్టిన పొగాకు కొనుగోళ్ల వేగాన్ని మరింత పెంచే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించినా అమలు కావడంలేదు. ఏ రైతు దగ్గరా కేజీ పొగాకు కూడా మిగలడానికి వీల్లేదని, చిన్న



రైతులకు తోడ్పాటును ఇవ్వటంతో పాటు పెద్ద రైతుల వద్ద కూడా త్వరితగతిన పొగాకు కొనుగోళ్లు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. కొనుగోలు యాప్‌లో నమోద్కెన రైతుల వద్దనే కాకుండా నమోదు కాని రైతుల వద్ద కూడా పొగాకును కొనాలని అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ కొనుగోళ్లు ఆశాజనకంగా లేవు. ప్రతి పొగాకు రైతు వద్ద తాము పండించిన దానిలో సగం నిల్వలు ఉండిపోయాయి. మార్క్ ఫెడ్ ధరలను చూసి ప్రయివేటు వ్యాపారస్తులు ఇళ్ల వద్దకు వచ్చి క్వింటాలు రూ. 3 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. దీంతో పంటకోసం చేసిన అప్పులు తీర్చడానికి పొగాకును వారికి తెగనమ్ముకోవాల్సి వస్తోందని కాకుమాను మండలం కొండపాటూరు రైతులు తెలిపారు. కాకుమానులో ధరలు దరనీయంగా ఉన్నాయని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులు పండించిన పొగాకును పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు తమలపాకుల సుబ్బారావు కోరారు. గిట్టుబాటు ధర ఇవ్వక పోగా నాణ్యమైన పొగాకుకు దారుణమైన ధరలు వేయడం సరికాదన్నారు. ఇలా అయతే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతారని పేర్కొన్నారు. క్వింటాలు 9 వేలకు తక్కువ కాకుండా మార్క్ ఫెడ్ వారు కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకుపోనున్నట్లు సుబ్బారావు వివరించారు.

## బ్రహ్మా సాగర్ లో పడి మహిళ మృతి

బ్రహ్మంగారిమఠం(కడప జిల్లా) (జర్నలిస్ట్ ఫైల్ ) సోమిరెడ్డి పల్లి పంచాయితీ లోని నరసన్నపల్లి గ్రామానికి చెందిన మడక లక్ష్మీదేవి(35)సోమవారం బ్రహ్మం సాగర్ నీటిలో పడి మృతి చెందింది. ఈ మధ్యకాలంలో మృతురాలు కూతురు అకస్మాత్తుగా మరణించడంతో అప్పటినుంచి లక్ష్మీదేవి మానసికంగా బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి బ్రహ్మం సాగర్ లో పడి మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే స్థానిక ఎస్సై శివప్రసాద్ హుటాహుటిన బ్రహ్మం సాగర్ కు వెళ్లి,సంఘటన స్థలాన్ని పరిశీలించి,మృతదేహాన్ని వెలికి తీసి,కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన వివరించారు.

## మట్టి గణపతి ను పూజిద్దాం



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):** మట్టి గణపయ్యను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుద్దం అంటూ బీజేపీ మైనారిటీ మోర్చ రాష్ట్ర నాయకులు డా. షేక్ అబ్దుల్ ఖుద్దుస్ పిలుపునిచ్చారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని కాకుమాను మండల పరిధిలోని పలు ప్రాంతాలలో మట్టి గణపతి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కుల మతాల భేదాలు లేకుండా జీవించాలని మందమందరం కూడా భారతియులమని కల్మషం లేకుండా ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకుంటూ జీవించాలని పిలుపునిచ్చారు. వినాయక చవితి పండుగను ప్రజలందరూ కూడా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని కోరుకున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కూడా మట్టి తో తయారుచేసిన ప్రతిమలను పూజించాలని పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ తెలిపారు. మండలానికి చెందిన ఖుద్దుస్ తొలి నుండి సమాజసేవ కొరకు అనేక రకాల సేవా కార్యక్రమం లు నిర్వర్తిస్తూ తన వంతుగా కుల మతాలకు అతీతంగా సేవ చేస్తున్నారని కొనియాడారు. భవిషత్ లో కూడా ప్రజలకు మరింత గా సమాజ సేవలు చేయాలని మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. బీజేపీ నాయకులు శ్రీధర్ శర్మ,రాం గోపాల్,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీనే రాజకీయ యూనివర్సిటీ




**తిరుపతి(జర్నలిస్ట్ ఫైల్)** రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎందరో నాయకులు రాజకీయ ఓనమాలు నేర్చుకున్న పార్టీ టీడీపీనేనని మంత్రి ఎస్.సవిత అన్నారు. కార్యకర్తల పార్టీగా టీడీపీ నిలుస్తుందని, పనిచేసిన వారికే గుర్తింపు లభిస్తోందని తెలిపారు. చంద్రన్న పాలనతో తెలుగు తమ్ముళ్లు కాలర్ ఎగరేస్తున్నారని, సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అయ్యాయని అన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో సమిష్టి స్ఫూర్తితో విజయాన్ని సాధించినట్టే, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అలానే గెలుద్దామని పిలుపునిచ్చారు. నామినేటెడ్, పార్టీ పదవుల కేటాయింపులు కార్యకర్తల సూచనల మేరకే జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అభినందనలు సాదియా అల్మాస్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** కోస్టారికోలో జరిగిన ఐపీఎఫ్ వరల్డ్ క్లాసిక్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 57 కిలోల మహిళా జూనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించిన మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి సాదియా అల్మాస్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అభినందించారు. ఆమె ప్రతిభతో అంతర్జాతీయ వేదికపై భారత జెండాను రెపరెపలాడించిందని, కాంస్య పతకాన్ని సాధించి దేశానికే కాకుండా మంగళగిరి గర్వకారణంగా నిలిచిందని తెలిపారు. అల్మాస్ అంకితభావం యువతకు స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.



ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమావేశమైన ఎంపి అసదుద్దీన్ ఒవైసి

## హైదరాబాద్‌లో ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలి : ఎంపి అసదుద్దీన్‌ఒవైసి

**హైదరాబాద్ (యాకుత్‌పుర), ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను సోమవారం ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఒవైసి కలిశారు. కొద్ది రోజులుగా హైదరాబాద్ నగరంలో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవటంతో ప్రజలు ఇబ్బందుల పాల వుతున్నారని ఎంపి ఒవైసి.. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్ట్యా నిలిచిపోయిన ఇంటర్నెట్ సేవలు వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఈ సమావేశంలో మలక్‌పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## కూరగాయలకు ఇతర రాష్ట్రాలే దిక్కు

### యేటా 19 లక్షల టన్నుల కొరత

### రాష్ట్ర అవసరాల్లో బయట నుండి 60 శాతం

### మహారాష్ట్ర క్యాలీఫ్లవర్, యుపి మిర్చి, జైపూర్ టమోట

### కొరత ఉన్న వాటిపై దృష్టి సారించని ఉద్యాన శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో వినియోగించే కూరగాయలకు సంబంధించి ఉద్యాన శాఖ వైఫల్యంతో ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. జనాభా అవసరాలకు తగినట్లుగా రాష్ట్రంలో కూరగాయల సాగు జరగడం లేదు. రాష్ట్రంలో కొరత ఉన్న కూరగాయలను ప్రోత్సహించి, వాటిని సాగు చేయించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. ఫలితంగా రాష్ట్ర అవసరాల్లో 60 శాతం ఇతర రాష్ట్రాల నుండే దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో కూరగాయల సాగు చేసేందుకు ప్రోత్సాహం లేక, తగిన సమాచారం, సలహాలు ఇచ్చేవారు లేక వాటి సాగు పట్ల రైతాంగం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. చివరకు పచ్చి మిర్చికి కూడా ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అగత్యం ఏర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా 3.10 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు అవుతున్నట్లు ఉద్యాన శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో ఏడాదికి 42 లక్షల టన్నుల కూరగాయలు అవసరం కాగా 23 లక్షల టన్నులు మాత్రమే సాగవుతోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 19 లక్షల టన్నుల కూరగాయల కొరత ఏర్పడుతోంది. ఫలితంగా పంటలు అధికంగా పండే తెలంగాణలో ప్రస్తుతం కాయగూరలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. వేసవిలో అన్ సీజన్‌లో 60 శాతం నుండి 70 శాతం కూరగాయలు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి అవుతున్నాయి. సాగు ఎక్కువగా జరిగే అక్టోబరు నుండి మార్చి వరకూ మాత్రమే 50 శాతం కూరగాయలు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్ర నుండి క్యాలీఫ్లవర్, రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుండి టమోటాలు, ఉత్తరప్రదేశ్ నుండి పచ్చిమిర్చి తెలంగాణ రాష్ట్రంలోకి వస్తోంది. శ్రీలంకలో సంక్షోభం కారణంగా ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి ఆ దేశానికి టమోటాలు, ఇతర కూరగాయలు సరఫరా అవుతుండడంతో తెలంగాణలో కూరగాయల ధరలు భారీగా పెరిగినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో భాగంగా జైపూర్ నుండి టమోటాలు, ఉత్తరప్రదేశ్‌లోని సంబాల్ మార్కెట్ నుండి పశ్చిమిర్చి, మహారాష్ట్ర నుండి క్యాలీఫ్లవర్ హైదరాదాబాద్‌తో సహా తెలంగాణలోని పలు పట్టణాలకు వచ్చినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూరగాయల ధరలు గత నెలతో పోలిస్తే చెప్పకోదగ్గ స్థాయిలో పెరిగాయి. నెల క్రితం కిలో 10 రూపాయలకు అమ్మిన టమోటా ప్రస్తుతం హైదరాబాద్‌లో క్వాలిటీని బట్టి 150 రూపాయలు పలుకుతోంది. బోడ కాకరకాయలు అయితే కిలో 400 రూపాయలు, మిర్చి 130 రూపాయలు, ఇక బీరకాయ, బెండకాయలు తదితర కూరగాయలు అన్నీ కిలోకు 60 రూపాయల పైబడి ధరలు పలుకుతున్నాయి. ఇక క్యాబేజీ విషయానికి వస్తే అన్ని రాష్ట్రాల నుండి హైదరాబాద్‌కు 1,650 క్వింటాళ్లు వస్తోంది. అయితే ఇటువంటి కూరగాయలను తెలంగాణలోనే పండించే అవకాశం ఉన్నా ఉద్యాన శాఖ నిర్లక్ష్యం కారణంగా ఇతర రాష్ట్రాలే దిక్కవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికే మద్దతు

### డిసెంబర్‌లో పార్టీ శతజయంతి వేడుకలు

### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** ఉపరాష్ట్రపతి ఎన్నికల నేపథ్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా ప్రకటించారు. సోమారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేస్తే ఏ ప్రభుత్వాన్ని అయినా నిలదీసే హక్కు ప్రజలకు, ప్రతిపక్షాలకు ఉంటుందన్నారు. భారత ఎన్నికల కమిషన్ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. కుల రాజకీయాలు, మత రాజకీయాలకు కేరాఫ్‌గా బిజెపి నిలిచిందని మండిపడ్డారు. ఓట్ల చోరీతో బిజెపి అధికారంలోకి రావడం చాలా అన్యాయమని.. ఇంతకంటే దౌర్భాగ్యం మరొకటి లేదన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో సిపిఐ పార్టీ శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించ నున్నట్టు తెలిపారు.

## ఎసిబి వలలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

### రూ.25 వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన వైనం

**చుంచుపల్లి, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** ఫెర్టిలైజర్ షాపు యజమాని నుంచి లంచం తీసుకుంటూ వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏసీబీ అదికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీబీ డీఎస్పీ రమేష్ వెల్లడించారు. మండలంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహారావు ఇటీవల తనిఖీల్లో భాగం గా యూరియా అమ్మ కాలకు సంబంధించి పాల్వంచ మండలంలోని ఉల్వనూరులో ఉన్న ఫెర్టిలైజర్ షాపు సిబ్బం దిని మీ వద్ద ఎలాంటి లైసెన్సులు లేవని బెదిరించి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సంబంధిత వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఫోన్ చేసి తాము అంత ఇచ్చుకోలేమని చెప్పడంతో రూ.30 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు తాము రూ.25 వేలు ఇస్తామని చెప్పడంతో సదరు అధికారి ఒప్పుకున్నారు. దీంతో రూ.25 వేలు నగదును సదరు అదికారికి ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



ఎసిబికి పట్టుబడిన వ్యవసాయ అధికారి నరసింహారావు

## ఎస్సారెస్పీలోకి వారం రోజుల్లో 128.394 టిఎంసిల వరదనీరు

### 61.449 టిఎంసిలు బయటకు విడుదల చేసిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరామసాగర్ జలాశయంపై ఎగువన మహారాష్ట్ర జైక్వాడ్ నుంచి బాబ్లీ వరకు అనేక ప్రాజెక్టులు నిర్మించి బేసిన్ బయటి ప్రాంతాలకు నీటిని తరలిస్తుండటంతో ప్రతియేడు ఎస్సారెస్పీకి నీరు వచ్చి చేరుతుందా లేదా అనే అనిశ్చితి నెల కొంటుంది. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ప్రతి యేడు జూలై 1న ఎత్తి అక్టోబర్ 29న దించి వేయాల్సి ఉంటుంది. అంతేకాదు మార్చి 1న బాబ్లీ గేట్లు ఎత్తి 0.6టిఎంసి నీటిని ఎస్సారెస్పీకి వదలాల్సి ఉంటుంది. ఈ సంవత్సరం బాబ్లీ గేట్లు ఆనవాయితీగా ఎత్తినా కూడా ఆగస్టు రెండో వారం పెద్దగా నీరు వచ్చి చేరలేదు. మూడోవారం మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరద ఎస్సారెస్పీలోకి పోటెత్తింది. వారం రోజుల్లోనే 128.394 టిఎంసిల నీటిని ఎస్సారెస్పీ ఒడిసిపట్టింది. అందులో 61.449 టిఎంసిల నీరు ఇందిరమ్మ ఫ్లడ్‌ఫ్లో, మిషన్‌భగీరథ, నిజామాబాద్, నిర్మల్ టిఎస్‌ఐడి పథకాలద్వారా, గుప్త లిఫ్ట్ ఇరిగేషన్, అనిసాగర్ లిఫ్ట్ ఇరిగేషన్, లక్ష్మీ కెనాల్, కాకతీయ మెయిన్ కెనాల్, జల విద్యుత్ ఉత్పత్తి వంటి అవసరాలు తీర్చుకోవడానికి వినియోగించడంతో పాటు స్పిల్‌వే ద్వారా దిగువకు విడుదల చేసిన 34 టిఎంసిల నీరు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వచ్చిచేరింది. శ్రీరామ సాగర్‌కు ప్రస్తుతం సోమవారం రాత్రి8గంటల వరకు ఎగువ నుంచి 30వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చిచేరుతోంది. అదే స్థాయిలో నీటిని బయటకు వదిలిపెడుతున్నారు. నీటిమట్టం 1090.90 ఫీట్ల ఎత్తులో 80టిఎంసిలనీరు ఇప్పు డు అందులో ఉంది. ఉష్ణోగ్రత పెరిగి పోవడంతో రోజుకు 666 క్యూసెక్కుల నీరు ఆవిరిగా వృధా అవుతోన్నది. జూరాల జలాశయానికి కూడా 3.88 లక్షల క్యూసెక్కుల వరదనీరు ఎగువన కర్ణాటక నుంచి ఆదివారం రాత్రి వరకు వచ్చిచేరింది.

## చంద్రబాబు, వైఎస్ హయాంలో హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడలేదు

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సోమవారం గాంధీభవన్ మాట్లాడుతున్న ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** చంద్రబాబు, వైఎస్ ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడలేదని, అదే హైదరాబాద్ అబివృద్ధిని అణగదొక్కే మీ కుటుంబం వాడుకొని ఆర్థికంగా ఎదిగిందని ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం గాంధీభవన్ ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌ను కెసిఆర్ కని పెట్టినట్లు కెటిఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. కెటిఆర్‌కి తెలియక మాట్లాడుతున్నారా అర్థం కావడం లేదని అభిప్రా యపడ్డారు. కెసిఆర్ హయంలో నాలుగు ఫ్లై ఓవర్లు, దుర్గం చెరువు సెల్ఫ్ పాయింట్ తప్ప ఏం కాలేదని ఆయన చెప్పారు.బరాబర్ ఎన్నికలు పెడతాం 42 శాతం అంతేకాదు బిసి రిజర్వేషన్ ఇస్తామని ప్రకటించారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలు వెళ్ళే దమ్ము ఉందా అని అంటున్నారు. పదేళ్లలో 60 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారితే, అప్పుడు మీ దమ్ముకు దుమ్ము పట్టిందా? అని నిలదీశారు. హైదరాబాద్‌లో ఎక్కువ ఎమ్మెల్యేలు గెలిచినా పార్లమెంట్‌లో సున్న వచ్చింది. కంటోన్మెంట్‌లో మూడో స్థానం వచ్చింది. ప్రెస్‌మీట్ మూడు పూటలు పెట్టకపోతే మిమ్మల్ని ప్రజలు మర్చిపోతారనుకుంటున్నారు. హరీశ్‌రావు వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న ప్పుడు డెంగ్యూ మరణాల సంఖ్య ఎంత ఉంది. కేవలం రేవంత్‌రెడ్డి హయంలో మాత్రమే డెంగ్యూ వస్తుందన్నట్లు చెబుతున్నారని అన్నారు. బిసిపై బిజెపి, బిఆర్ఎస్ లకు చిత్తశుద్ధి ఉంటే 42శాతం పార్టీ పరంగా ఇస్తామని ప్రకటిం చండి.రేవంత్ రెడ్డికి బిజెపి ఎంపిలు కాపాడితే తెలంగాణ నంబర్ వన్ అయ్యేదని అన్నారు. మెట్రో ఫెజ్ 2 వచ్చేది. పది మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీ లో ఉన్నారో చెప్పుకోవడం అనేది వాళ్ళ ఇండిజ్యుల్ కెపాసిటీ అని తెలిపారు. చంద్రబాబుకు ఇచ్చే ఇంపార్టెన్స్ బిజెపి ఎంపీలకు కేంద్రం ఇవ్వడం లేదు. తెలంగాణకు రావాల్సిన వాటాను గుజరాత్, ఎపికి కేంద్రం పంపుతుందని అవేదన చెందారు.

**ఎంఎంటిఎస్‌తో భువనగిరి ప్రజల కష్టాలు తీరుతాయి**

ఘట్కేసర్ నుండి యాదాద్రి భువనగిరి ఎంఎంటిఎస్ రైలు భూసేకరణ కోసం యాదాద్రి కలెక్టర్, మేడ్చల్ కలెక్టర్లు కృషిచేస్తున్నారని భువగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఎంపి చామల సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కలిసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేసి యాదాద్రికీ వచ్చే భక్తులకు, అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయని ఆయన చెప్పారు.

## 'స్థానిక' ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలి



సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

### సత్యాగ్రహ దీక్షలో ఎంపి ఆర్.కృష్ణయ్య

### మద్దతు తెలిపిన ఎంపి ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీమంత్రి శ్రీనివాసగౌడ్ తదితరులు

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** స్థానిక సంస్థ ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు చట్టబద్ధం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఆర్.కృష్ణయ్య చేపట్టిన సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈదీక్షకు మల్కా జిగిరి పార్లమెంట్ సభ్యు డు ఈటల రాజేందర్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్, బీసీ కమీషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, గువ్వల బాలరాజు, ఐఏఎస్ చిరంజీవులు తదితరులు హాజరై మద్దతు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీలకు జనాభా ప్రకారం సమాన వాటా కావాలని డిమాండ్ చేశారు. 76 సంవత్స రాలుగా ముఖ్య మంత్రి, మంత్రి పదవులు కూడా మీరే తీసుకుంటున్నారని, మాకు కనీసం సర్పంచులు, కౌన్సిలర్లు కూడా వద్దా అని ప్రశ్నించారు. 42 శాతం రిజర్వేషన్లు అని హామీ ఇచ్చి, ఇప్పుడు పార్టీ పరంగా ఇస్తామని ప్రకటిస్తున్నారని, పార్టీల పరంగా మాకు భిక్షం వద్దని, 42శాతం రిజర్వేషన్ మా హక్కు, మా హక్కు మాకు కావాలని స్పష్టం చేశారు. ఈటెల రాజేందర్ మాట్లాడుతూ 42శాతం రిజర్వేషన్ల కోసం ఆర్.కృష్ణయ్య చేస్తున్న సత్యాగ్రహదీక్షకు సంపూర్ణంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాకమాటలు బందుపెట్టి, తక్షణమే 42శాతం రిజర్వేషన్లు అమలుచేసి, స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఓడిపోతామని భయంతో బీసీ సమస్య అడ్డుపెట్టుకుని అది తేలేవరకు ఎన్నికలు జరపమని మోసం చేసే ప్రయత్నం చేస్తే తెలంగాణ బీసీ సమాజం మిమ్మల్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఒక బీసీ ప్రధానమంత్రి, 27మంది ఓబీసీలను మంత్రులుగా చేయగలిగిన పార్టీ భారతీయజనతాపార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. ఉపరాష్ట్రపతి పదవిని కూడా ఓబీసీకి ఇచ్చి, సన్మానించుకున్న చరిత్ర మనకు తెలుసన్నారు. దీక్షా కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, నీల వెంకటేష్, లాల్‌కృష్ణ, వేముల రామకృష్ణ, బర్క కృష్ణ, రాజేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు ఆనంద్ గౌడ్, దూదిమెట్ల బాలరాజ్, రాజారామ్‌యాదవ్, బి.ఎస్.రాములు తదితరులు పాల్గొన్నారు.

## అనాజ్‌పూర్ రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు ఇవ్వాలి

### జాన్‌వెస్లీతోపాటు, రైతు నేతల అరెస్టును ఖండిస్తున్నాం: సిపిఎం రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** రంగారెడ్డి జిల్లా అనాజ్‌పూర్ రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు వెంటనే ఇవ్వాలని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అనాజ్‌పూర్ భూపోరాటం నేపథ్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు ఇ. నర్సింహ, రైతుసంఘం జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని పార్టీ రాష్ట్ర కమిటీ మండిపడింది. సిపిఎం పార్టీ నాయకులతోపాటు సంబంధిత రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టుచేసి పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామని పార్టీ రాష్ట్ర ఆఫీస్ ఇన్‌ఛార్జ్ జె బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. అరెస్టు చేసిన అయిన వారిని తక్షణమే విడుదల చేసి, బాధిత రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి, ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లా పూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ రెవెన్యూ సర్వే నంబర్లు 274, 275, 276, 277, 278, 281లో 125 ఎకరాల సీలింగ్ భూమిని 125 మంది పేదలకు 1991 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ చేసి, సర్టిఫికేట్లు, పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేసిందన్నారు. అట్టి భూములను నాటి నుండి నేటి వరకు రైతులు సాగు చేసుకుంటున్నారని.. కానీ ధరణి పోర్టల్ ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు నమోదు చేయలేదన్నారు. ఇప్పటికీ ధరణి పాసుపుస్తకం ఇవ్వ లేదని.. దీంతో రైతు భరోసా, రైతుబీమా, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, బ్యాంకు లోన్లు రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చి న్యాయం చేయాలని బాధిత రైతులు గత ఎనిమిదేళ్ళుగా అనేకసార్లు జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహాశీల్దారును కలిసినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం) అబ్దుల్లాపూర్‌మెట్టు మండల కమిటీ బాధిత రైతులకు అండగా నిలబడిందని.. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు, బాధిత రైతులు భూమి దగ్గరకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని వారిని అక్రమంగా అరెస్టులు చేశారని మండిపడ్డారు.

తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుని బాధిత రైతులకు న్యాయం చేయాలని, అక్రమంగా అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పోలీసు పహారా మధ్య ముగిసిన స్వాతి అంత్యక్రియలు

### మూసీలో లభ్యంకాని మృతురాలి శరీర భాగాలు

### మొండెంతోనే అంత్యక్రియలు పూర్తిచేసిన కుటుంబీకులు

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** భర్త చేతిలో అత్యంత దారుణంగా హత్యకు గురైన గర్భిణీ స్వాతి అంత్యక్రియలు సోమవారం వికారాబాద్ జిల్లా కామారెడ్డి గూడలో ముగిసాయి. తొలుత స్వాతి ముఖం, చేతులు, కాళ్లు వెతికి పూర్తి శరీరం అప్పగిస్తేనే అంత్యక్రియలు నిర్వహిస్తామని స్వాతి తల్లిదండ్రులు ఆందో ళనకు దిగారు. కానీ, భారీవర్షాల నేపథ్యంలో మూసీ ఉధృతంగా ప్రవహించ దంతో ఎంత గాలించినా శరీరభాగాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు, గ్రామస్థులు వారిని అంత్యక్రియలు చేసేలా ఒప్పించారు. నిందితుడికి చట్ట ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చారు. గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించాక స్వాతి మొండేన్ని కామారెడ్డిగూడకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. నిందితుడు మహేందర్‌రెడ్డి తీరుపై గ్రామస్థులు ఆగ్రహంతో మండిపడ్డారు. నిందితుడి ఇంటిముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలోకి మహేందర్ కుటుంబసభ్యులను రానివ్వమని తేల్చిచెప్పారు. పోలీసులు భారీగా మోహరించి, అంత్యక్రియలు పూర్తి చేయించారు.

**వాడో పెద్దసైకో.. మృతురాలి సోదరి శ్వేత**

నిందితుడు మహేందర్‌రెడ్డి పెద్దసైకో అని, స్వాతితో తరచూ గొడవపడేవాడని స్వాతి సోదరి శ్వేత తెలిపింది. తన అక్కను అతికిరాతకంగా చంపిన వాడికి బతికే అర్హత లేదని, వెంటనే చంపేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. వాడు ఒకవేళ జైలు నుంచి విడుదలైతే తమ కుటుంబాన్ని కూడా అంతం చేస్తాడంటూ రోదించింది.

లేకపోతే మహేందర్‌రెడ్డిని తమకు అప్పగించాలని, మా అక్కను ఎలాగైతే చంపాడో వాడిని అలాగే చంపుతామని ఆవేదన వ్యక్తం చేసింది. స్వాతి హత్యకు కొద్దిరోజుల ముందు మహేందర్‌రెడ్డి తాను ఉండే హాస్టల్ దగ్గరికి వచ్చి కలిశాడని, ఈ విషయం స్వాతికి చెప్పొద్దని అన్నాడని చెప్పింది. అలాగే తాము గొడవ పడుతున్న విషయం గురించి అమ్మనాన్నలకు చెప్పొద్దని స్వాతి కూడా తనతో చెప్పినట్లు తెలిపింది. నిందితుడికి వెంటనే ఉరిశిక్ష విధించాలని పోలీసులను ప్రాధేయపడింది.

**శరీరభాగాల కోసం గాలించిన డిఆర్‌ఎఫ్ బలగాలు..**

తన భార్య స్వాతిని హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని మాయం చేసే ప్రయత్నంలో ఆమె శరీర భాగాలను ముక్కలు ముక్కలుగా రంపంతో కోసి ప్రతాపసింగారం వద్ద గల మూసీలో విసిరేశాడు నిందితుడు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు.. జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో సహాయంతో శరీర భాగాలను వెతికించారు. ఆదివారం పది కిలోమీటర్ల మేర గాలించిన అవి లభ్యం కాలేదు. ఈ క్రమంలో తిరిగి మళ్లీ సోమవారం మరోసారి డీఆర్ఎఫ్ బృందాలు బోట్ల సహాయంతో గాలించిన ఫలితం లేకుండా పోయిందని పోలీసులు పేర్కొన్నారు.

## శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఆర్‌టిసి బస్సు

### ఆర్‌టిసి ఎండి సజ్జనార్

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయమైన శంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి ఆర్‌టిసి నేరుగా బస్సును నడపనుంది. ఈ సౌకర్యాన్ని భక్తులు ఉపయోగించుకోవాలని ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ 'ఎక్స్' వేదికగా సూచించారు. శ్రీశైలం వెళ్లాలనుకునే భక్తుల సౌకర్యార్థం విమానాశ్రయానికి సమీపంలో ఉన్న ఆర్‌జిఐఏ క్రాస్ రోడ్స్ వద్ద కొత్తగా బోర్డింగ్ పాయింట్‌ని టిజిఎస్ ఆర్‌టిసి ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ఎయిర్‌పోర్ట్ నుంచి పుష్పక్ బస్సుల్లో సమీపంలో ఉన్న ఆర్‌జిఐఏ బోర్డింగ్ పాయింట్‌కి భక్తులు ప్రయాణించి.. అక్కడి నుంచి ఆర్‌టిసి బస్సుల్లో శ్రీశైలానికి వెళ్లొచ్చని తెలి పారు. ఈ బోర్డింగ్ పాయిం ట్ నుంచి ప్రతి 20 నిమిషాలకి ఒక బస్సు శ్రీశైలానికి అందుబాటులో ఉంటుందన్నారు. ఎయిర్‌పోర్టు నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులు టిజిఎస్‌ఆర్‌టిసి బస్.ఇన్ వెబ్‌సైట్‌లోనూ ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని.. రిజర్వేషన్ సమయంలో వారు ఆర్‌జిఐఏ క్రాస్‌రోడ్ బోర్డింగ్ పాయింట్‌ని ఎంచుకోవాలన్నారు. శ్రీశైలం వెళ్లే భక్తులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని టిజిఎస్ ఆర్‌టిసి కోరుతోందని సజ్జనార్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

## అడ్‌హాక్ కమిటీ యూరియా సరఫరాలో కేంద్ర వైఫల్యం

### కేటాయింపుల కోసం ఎంతకైనా పోరాడతాం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బహిరంగ లేఖ

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రానికి యూరియా సరఫరా చేయడంలో కేంద్రం ఘోరంగా వైఫల్యం చెందిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఇప్పటికే పాత నిల్వలతో కలుపుకొని 7.32 లక్షల టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు సోమవారం రైతులకు బహిరంగ లేఖ విడుదల చేశారు. కేంద్ర అసమర్థతను రాష్ట్ర ప్రభుత్వంపై నెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇతర దేశాల నుంచి దిగుమతి కావల్సిన యూరియా నిలిచిపోవడం, దేశీయంగా డిమాండ్ కు తగ్గ ఉత్పత్తి లేక అన్ని రాష్ట్రాల్లోనూ యూరియా కొరత ఉందన్నారు. తెలంగాణకు కేంద్రం ఈ ఖరీఫ్ సీజన్‌లో 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయింపు చేయగా, ఇందులో ఇప్పటి వరకు 5.72 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేసిందని చెప్పారు. ఇంకా 2.58 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయలేదని, దీంతో డిమాండ్‌కు తగ్గట్టు నిల్వలులేక రాష్ట్రంలో ఇబ్బందులు తలెత్తాయని వివరించారు. దిగుమతి యూరియాలో ఇబ్బందులు తలెత్తుతాయని ముందే గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి స్వదేశీ యూరియానే కేటాయించాలని ఎన్నోసార్లు కోరినా పట్టించుకోలేదని తప్పుపట్టారు. యూరియా కొరతపై సొసైటీల వద్ద చెప్పులు క్యూ లైన్ లో పెట్టించడం, బర్త్ డే వేడుకలు పేరుతో బస్తా గిఫ్ట్ ఇచ్చినట్లు స్కిట్ లు చేయడం, మహిళలను క్యూ లో నిలబెట్టి కొరత ఉందని అసత్యాలు ప్రచారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసే దిగజారుడు రాజకీయానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం తరపున రాష్ట్ర రైతాంగానికి యూరియా సరఫరాలో జరిగిన ఆలస్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులకు కారణం ఎవరో రైతులు తెలుసుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.




ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి

### మాజీమంత్రి హరీశ్‌రావు

**హైదరాబాద్(ధర్నాచౌక్), ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బీఆర్‌టియూ అనుబంధ సంఘమైన తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆశా వర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై హరీష్‌రావ్ మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల సమయంలో మమ్మల్ని గెలిపించండి ఫిక్స్ వేతనం 18వేలు ఇస్తామని ఆశా వర్కర్లకు కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ మాటలు నమ్మి, ఆశావర్కర్లు ఓట్లు వేసి గెలిపించారు కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని అమలుచేయలేదని ఆరోపించారు. ఆశావర్కర్లు కేవలం రేవంత్‌రెడ్డి ఏమాట ఇచ్చారో ఆ మాటను నెరవేర్చండి అని అడుగుతున్నారు తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరటం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆశావర్కర్లకు ఇచ్చిన మాటలు నెరవేరుస్తారా లేక ఉద్యమించమంటారా అని ప్రశ్నించారు. సంఘం గౌరవాధ్యక్షులు, బీఆర్‌టియూ రాష్ట్ర అధ్యక్షులు జి.రాంబాబుయాదవ్ మాట్లాడుతూ ఆశాల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, టీఆర్‌టియూ ఉపాధ్యక్షులు బి.శివశంకర్, సంఘం అధ్యక్షురాలు ఆర్.సంతోష, ప్రధాన కార్యదర్శి బి.మంజుల తదితరులతోపాటు వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చిన ఆశాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పత్తి రైతులకు మద్దతు ధర

### అందుబాటులోకి కాటన్ కార్పొరేషన్ ప్రత్యేక యాప్

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):** పత్తి రైతులకు మద్దతు ధర అందుకునేందుకు కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'కపాస్ కిసాన్' పేరుతో రైతుల నిమిత్తం ఈ కొత్త యాప్‌ను రూపొందించింది. కాటన్ కార్పొరేషన్ అధికారవర్గాలు వెల్లడించిన వివరాలు ప్రకారం పత్తి వేసిన రైతులు వారు పేర్లను సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు ఈ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధంగా ఈ యాప్‌లో నమోదు చేసుకున్న రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోలు కేంద్రాల్లో పత్తి పంటను అమ్ముకునే అవకాశం కల్పించింది. ఈ మేరకు ఈ యాప్‌లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత ఈ యాప్‌లో ఆధార్ కార్డు, మీ భూమి రికార్డులు, పత్తి పంటకు సంబంధించిన వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. తద్వారా దేశవ్యాప్తంగా పత్తి రైతులు ఎందరున్నారు, వారికి వేసిన పత్తి పంట విస్తీర్ణం ఎంత అనే వివరాలు అన్నీ కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా వద్ద రికార్డ్ అవుతాయి. ఈ ఏడాది పత్తికి కనీస మద్దతు ధర రూ.8,110గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. కపాస్ కిసాన్ యాప్‌లో రిజిస్టర్ అయిన రైతులు పత్తిని అమ్మే సమయంలో స్లాట్ బుక్ చేసుకోవాలి. అప్పుడు ఏ రోజు పత్తిని సీసీఐ కేంద్రానికి తీసుకెళ్లాలో యాప్ వివరాలు పంపుతుంది. ఈ పద్ధతి వల్ల పత్తిని అమ్ముకునేందుకు రైతులకు నిరీక్షణ సమస్యలు ఉండవని, ప్రధానంగా వారికి మద్దతు ధరలు దక్కుతాయని కాటన్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు.

# మట్టి వినాయకుడిని పూజిద్దాం




**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొత్తపేటలోని ఎస్.కె. పి. వి. వి. హిందూ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు కంచర్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుదాం - మట్టి గణ పతి విగ్రహాలను పూజిద్దాం అనే నినాదంతో ఎనిమిదవ ఆంధ్ర ఎయిర్ స్క్వాడ్రన్ ఎన్ సి సి విద్యార్థులు అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని పాతబస్తీ వీధుల్లో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మట్టి గణపతిని పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారని ఆయన చెప్పారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, కెమికల్స్ తో నిండిన విగ్రహాలను నదుల్లో నిమజ్జనం చేయడం కారణంగా జల చరాల ప్రాణానికి ముప్పు వాటి ల్లుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎన్సిసి అధికారి బి. బ్రహ్మేశ్వర రావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు జే. ఆనంద కుమార్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్రావు, కుంచం. శ్రీనివాస్, జి.పురుషోత్తం, ఎస్. శ్రీనివాసరావు, వి. అరుణ కుమారి, డాక్టర్ కే. కృష్ణ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# కనీస పెన్షన్ రూ. 9వేలు ఇవ్వాలి

## నినదించిన పెన్షనర్లు



**విజయవాడ, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆల్ ఇండియా కో-ఆర్డినేషన్ కమిటీ, ఏపి ఆర్ పి ఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటల నుండి జరిగిన ధర్నా కార్యక్రమంలో పెద్దఎత్తున వివిధ రంగాలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చి, నిరసన తెలియచేశారు. ధర్నాని ఉద్దేశించి రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులు అజయకుమార్ మాట్లాడుతూ.. గత 10 సంవత్సరాలుగా పెన్షనర్లు తమ డిమాండ్ల సాధన కోసం అనేక విధాలుగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు, పెన్షనర్లుకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలతో కార్పొరేట్లకు ప్రజల సొమ్మును దోచిపెడుతోందన్నారు. పెన్షనర్ల, కార్మికుల సొమ్ము 10లక్షల కోట్ల నిధి వున్నా, కనీస పెన్షన్ పెంచకుండా నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తపరిచారు. కనుక రూ.1000ల కనీస పెన్షన్ ను రూ.9000 లకు పెంచి, కరువు భత్యంతో కలిపి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్.అమరయ్య శాస్త్రి మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కు విరుద్ధంగా హయ్యర్ పెన్షన్ అమలు విధానాన్ని విస్మరించి దామాషా పద్ధతి పేరుతో 30 శాతం తక్కువగా ఇస్తూ కేంద్రం మోసం చేస్తున్నదని విమర్శించారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు వ్యతిరేకంగా ఇటీవల చేసిన పెన్షన్ అమెండ్ మెంట్ యాక్ట్ ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ ధర్నానుద్దేశించి కృష్ణా జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరావు, బీడీఆర్ రెడ్డి, మెడికల్ రిప్స్ నాయకులు రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా పీఎఫ్ కార్యాలయం ద్వారా ప్రధాని మోడీకి, కేంద్ర కార్మిక శాఖ మంత్రి మాన్సుక్ మాండావియా, సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ కు వినతిపత్రాలు పంపారు. అనంతరం ఆర్టిసి, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిషా ద్వారా వినతిపత్రం పంపారు.

# మల్లవల్లి గ్రామంలో అంతర్గత రోడ్ల అభివృద్ధిని అడ్డుకోకండి



**హనుమాన్ జంక్షన్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న మల్లవల్లి గ్రామాన్ని అబివృద్ధిలో పథంలో నడిపించేందుకు నడుంబిగించిన యువ పారిశ్రామికవేత్తలకు వీలైతే సహకరించాలి కాని అభివృద్ధికి ఆటంకపరచరాదు.. పారిశ్రామికా భివృద్ధికి మౌలిక వసతులకై మనవంతు చేయూతనందిస్తే పారిశ్రామిక వృద్ధికి మరియు నిరుద్యోగ నివృత్తికి దోహదపడినట్లేనని గమనించి మౌలిక వసతుల కల్పనకై మన వంతు చూయూత నిద్దాం. ముందుకు రండి అంటూ అభివృద్ధి నిరోదకులను పలువురు గ్రామస్థులు నేడు ఒక ప్రకటనలో అభ్యర్థించారు. వివరాల్లోకి వెళితే... ఆరాధ్య బయోఫ్యూ యల్స్ & విశ్వ శ్రీ ప్రోటీన్ ప్రైవేట్ లిమిటెడ్. మల్లవల్లి గ్రామం, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లా వారు సంయుక్తంగా మల్లవల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి అభివృద్ధి కార్యక్రమానికి రైతులు సంతకాలతో తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ... రైతులు గ్రామంలోని అంతర్గత రహదారుల ఏర్పాటుకు ఎలాంటి అభ్యంతరం లేకుండా ఈ అభివృద్ధి కార్యక్రమానికి లిఖిత పూర్వకంగా తమ అంగీకారాన్ని తెలిపారు. అయితే, కొందరు వ్యక్తులు ఈ అభివృద్ధి పనులపై అనవసర ఆటంకాలు సృష్టిస్తూ, రహదారి అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారు. ఈ విధమైన చర్యలు అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని ఆరాధ్య బయోఫ్యూయల్స్ & విశ్వశ్రీ సంస్థలు సంయుక్తంగా ఖండించాయి. రైతులు తమ సంతకాలతో అంగీకారం తెలిపిన వినతి పత్రాలు అధికారులకు విశ్వశ్రీ ప్రొటీన్స్ సంస్థ వారిచే డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో సమర్పిం చబడినాయి. అలాగే వీరవల్లి పోలీస్ స్టేషన్ లో అందజేశారు. సంబంధిత అధికారులు ఈ వ్యవహారంలో తగిన చర్యలు తీసుకొని, అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగించేలా చూడాలని విశ్వశ్రీ సంస్థ వ్యవస్థాపకులు ఒక ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేసారు.

# కృత్రిమ మేధస్సు యంత్ర అభ్యాసంలో ప్రపంచ ప్రగతి ఆవిష్కరణ







- కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న సాంకేతి కతలపై ఐదవ అంతర్జాతీయ సదస్సు

**హైదరాబాద్, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):**

మహీంద్రా యూనివర్సిటీలో నిర్వహించిన కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌లో అభివృద్ధి చెందుతున్న సాంకేతి కతలపై ఐదవ అంతర్జాతీయ సదస్సు (ఐసిఈటీసిఐ-2025) లో అకాడెమియా ఇండస్ట్రీలోని ప్రముఖ నిపుణులు ఒకే వేదికపై సమావేశమై, డీప్ లెర్నింగ్, సీక్వెన్స్ మోడలింగ్, కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్‌లోని సాధారణ అంశాలపై కొత్త ఆవిష్కరణలను చర్చించారు. సదస్సు మొదటి రోజు ట్యూటోరియల్స్ వర్క్‌షాప్‌లకు కేటాయించబడింది. ఇవి పాల్గొనేవారికి ఆధునిక కంప్యూటేషనల్ పద్ధతులపై ప్రాయోగిక అవగాహన కల్పించాయి. ఈ దశ, తదుపరి రెండు రోజులపాటు జరిగిన కీ నోట్ లెక్చర్లు టెక్నికల్ పేపర్ ప్రెజెంటేషన్లకు బాటలు వేసింది. ప్రధాన అతిథి, మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) మాజీ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ డా. సంజయ్ కుమార్ ఝా, మాట్లాడుతూ %-% "భారతదేశం రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో స్వావలంబన సాధించాలంటే, మెటీరియల్స్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కలయికలోనే ఆవిష్కరణలు జరగాలి. కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ కారణంగా పదార్థాల అభివృద్ధి చక్రాన్ని దశాబ్దాల నుండి కేవలం కొన్ని సంవత్సరాలకు కుదించవచ్చు. ఆధునిక సెన్సర్లు, ఎల్ ఓ టి, రోబోటిక్స్‌తో కలిపి కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ ఆధునిక తయారీ యూనిట్లలో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. వేగంగా మారుతున్న టెక్నాలజీ దశలో, ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని పద్ధతులతో అనుసంధానం చేయడం, దానికి అనుగుణంగా నైపుణ్యాన్ని పెంపొందించడం అత్యవసరం" అన్నారు. ఈ సందర్భంగా మిస్టర్ విశాల్ శర్మ, ప్రెసిడెంట్, డెలాయిట్ కన్సల్టింగ్ యు ఎస్ ఎ (ఇండియా) మాట్లాడుతూ "కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ యొక్క సంపూర్ణ సామర్థ్యాన్ని సహకారం ద్వారానే వినియోగించుకోవచ్చు. అకాడెమియా పరిశోధన, ప్రతిభను అందిస్తే, ఇండస్ట్రీ ఆవిష్కరణలను విస్తృత స్థాయిలో అమలు చేస్తుంది. ప్రభుత్వం విధానాలు, మౌలిక సదుపాయాలను కల్పిస్తుంది. ఈ మూడు కలిసినప్పుడు వ్యాపారాలు, ఆర్థిక వ్యవస్థలు, సమాజానికి లాభదాయకమైన ఆవిష్కరణలు సాధ్యమవుతాయి. ముఖ్యంగా ఏజెంటిక్ ఏఐ వ్యాపారరంగంలో పెద్ద వేగవంతకారిగా మారబోతోంది" అని అన్నారు. ఈ సందర్భంగా డా. యజులు మేదురి, వైస్ చాన్సలర్, మహీంద్రా యూనివర్సిటీ మాట్లాడుతూ "ఈ సదస్సు ఆలోచనలు పంచుకోవడానికి, అనువర్తనాలను అన్వేషించడానికి, వాస్తవ ప్రపంచ సవాళ్లకు పరిష్కారాలను కలిగించే ఆవిష్కరణలకు ప్రేరణనివ్వడానికి వేదికగా నిలుస్తోంది. ఇది మాకు ఇంటర్‌డిసిప్లినరీ విద్య, అనుభవాత్మక అధ్యయనం, తదుపరి తరాల పరిశోధకులు, ఆవిష్కర్తలను పెంపొందించడంపై ఉన్న దృష్టిని మరింత బలపరుస్తుంది" అన్నారు. సదస్సులో 50కి పైగా సంస్థల నుండి శాస్త్రవేత్తలు తమ పత్రాలను సమర్పించారు. వీటిలో ఐఐటీ, ఐఐఐటీ, ఎన్ ఐ టీ లు వంటి భారతదేశ ప్రముఖ విద్యాసంస్థలు ఉన్నాయి. కీ నోట్ లెక్చర్లను అంతర్జాతీయంగా పేరుపొందిన నిపుణులు అందించారు. వారిలో ప్రొఫెసర్ చంద్రజిత్ బాజాజ్ (టెక్సాస్ విశ్వవిద్యాలయం, ఆస్టిన్, యూఎస్ ఏ ), ప్రొఫెసర్ కల్యాణ్మయ్ దేబ్ (మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ, యూఎస్ ఏ), ప్రొఫెసర్ అకిరా హిరోసే (టోక్యో విశ్వవిద్యాలయం, జపాన్), డా. సమీర్ జైన్ (మైక్రోసాఫ్ట్ ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్, ఇండియా), డా. జెఫ్ అడి (నివిడియా కార్పొరేషన్, సింగపూర్) ఉన్నారు. వాలెడిక్టరీ లెక్చర్ను డా. రాధిక మమిడి (ఐఐఐటీ-హైదరాబాద్) అందించారు. ఆమె, సహజ భాషా ప్రాసెసింగ్ భవిష్యత్తును రూపకల్పన చేయడంలో కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్రను ప్రత్యేకంగా రేఖాంకితం చేశారు.

# కొత్త ఆలోచనలే వ్యాపారానికి పెట్టుబడి






**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):**

సమాజ అవసరాలకు కొత్త ఆలోచనలు జోడించి వస్తువులు, సేవల ఆధారంగా వ్యాపారాన్ని రూపొందిస్తే విజయం సాధించడం ఎంతో తేలిక అని కెబిఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి అన్నారు. పిజి కళాశాల మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ ఎంట్రప్రెన్యూర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబిఎ విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను కృష్ణవేణి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిరంతర అన్వేషణ, పరిశీలన, పరిశోధన వ్యాపారానికి పునాది వేస్తాయన్నారు. పోటీతత్వం అలవరచు కోవాలని, సాంకేతికతను జోడించినప్పుడే వ్యాపారం విజయవంతం అవుతుం దన్నారు. సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ సరికొత్త వ్యాపార ఆవిష్కరణలకు కళాశాల పక్షాన చేయూత అందిస్తామన్నారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ వ్యాపారం వల్ల వ్యక్తిగత అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి కూడా సాధ్యమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను సందర్శించారు. పి.జి కోర్సెస్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, మేనేజ్మెంట్ విభాగాధిపతి రవికిరణ్, అధ్యాపకులు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంలో స్పష్టత ఉండాలి

- ఆర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులదే భాధ్యత
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఆగస్టు 26(జర్నలిస్ట్‌ఫైల్):**

ప్రజా సమస్య పరిష్కారంలో స్పష్టత తప్పని సరిఅని ఆర్జీలు పునరావృతమైతే జిల్లా అధికారులు భాధ్యత వహించాల్సివస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలనను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యతను ఇస్తుందని ప్రజల నుండి స్వీకరించిన ఆర్జీలకు పరిష్కరం చూపడంలో జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్జీల పరిష్కారంలో స్పష్టత ఉన్నప్పుడే పరిష్కారం అవుతాయని, లేదంటే సమస్య పునరావృతమవుతూనే ఉంటుందన్నారు. ఆర్జీల పునరావృతం భాధ్యత జిల్లా అధికారులదే అన్నారు. పిజిఆర్ఎస్ పై ప్రజల పెట్టుకున్న నమ్మకానికి మరింత బలం చేకూర్చేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిపెట్టి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కార వ్యవస్థ పటిష్ట పర్యవేక్షణకు, అర్జీ స్వీకరించింది మొదలు అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించే వరకు ప్రతి దశలోనూ పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిచ్చేలా, ఆర్జీలు పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ వెల్లడిరచారు.

### 187అర్జీల స్వీకరణ

రెవెన్యూ శాఖకు సంబంధించి 53 అర్జీలు ఉన్నాయి. పోలీస్ 30, ఎంఎయుడి 22, విద్య 18, పంచాయతీరాజ్ 10, హెల్త్9, డిఆర్‌డిఏ7, ఏపిసిపిడిసిఎల్ 5, విభిన్న పౌరసరఫరాలు5, ప్రతిభావంతులు4, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్4, సర్వే4, ఏపిఎస్ డబ్ల్యు ఆర్ఇఐఎస్ 4, ఇరిగేషన్ 2, గిరిజన సంక్షేమం2, వ్యవసాయ2, సాంకేతిక విద్య, ఆర్‌డబ్ల్యుఎస్, బ్యాంకు, ఐసిడిఎస్, దేవాదాయ, సోషల్ వెల్ఫేర్, విభాగాలకు సంబంధించి ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 187 అర్జీలు స్వీకరించడం జరిగింది ఇందులో 93 ఆర్జీలు స్వయంగాను 94 ఆర్జీలు అన్‌లైన్ ద్వారా స్వీక రించిన్నట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్య క్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా, డిఆర్వో ఎం లక్ష్మీనరసింహం, ఆర్డీవో కె. చైతన్య, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. పోసిబాబు, ఎసిపి కె. వెంకటేశ్వరరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో బెయిలు లేదా రాజీనామా



## అరెస్టయితే ప్రధానికైనా, ముఖ్యమంత్రికైనా అదే నియమం

### జైలునుంచి పాలన న్యాయం కాదుకదా!: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా జైలు నుంచే పరిపాలన చేయడం మంచి విషయమేనా? అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రశ్నించారు. మన ప్రజాస్వామ్యానికి అదిమర్యాదపూర్వకంగాఉంటుందా? అంటూ విపక్షాలపై మండిపడ్డారు. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామా అంశంపైనా స్పందించారు. విపక్షాలు ఇప్పటికీ కూడా జైలుకు వెళ్తే సులభంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగలమని అనుకుంటున్నారు. వారు జైలునే సిఎం, పిఎం అధికారిక నివాసాలుగా మార్చేస్తారు. అప్పుడు డిజిపి, చీఫ్‌సెక్రటరీ, కేబినెట్ సెక్రటరీ వంటి ఉన్నతాధికారులు జైలు నుంచే ఆదేశాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలాంటి సిద్ధాంతాలను నేను, మాపార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. జైలు నుంచే ప్రభుత్వాలను నడిపే పరిస్థితి మన దేశంలో రాకూడదు అని అమిత్ షా అన్నారు. ప్రధానిగానీ, ముఖ్యమంత్రి గానీ లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్న ఏ నేత అయినా సరే ఏదైనా కేసులో అరెస్టయితే 30 రోజుల్లో బెయిల్ పొందాలి. లేదంటే తమతమ పదవులకు రాజీనామా చేయాలి. అలా చేయకపోతే చట్టమే వారిని తప్పించేలా 130వ రాజ్యాంగ సవరణను తీసుకొస్తున్నాం.

చట్టమేదైనా ప్రభుత్వం, ప్రతిపక్షానికి ఒకేలా అమలవుతుంది. ఈ నిబంధన ప్రధాని పదవికి కూడా వర్తించేలా స్వయంగా నరేంద్రమోడీనే దీన్ని సవరణలో చేర్చారు. ఆయనకు కూడా ఇది వర్తిస్తుంది. ప్రధాని జైలుకెళితే ఆయనైనా రాజీనామా చేయాల్సిందే. ఎన్నికైన ప్రభుత్వం రాజ్యాంగ సవరణను తీసుకొస్తే దానిపై అభ్యంతరాలు లేవనెత్తే హక్కు అందరికీ ఉంటుంది. అంతేగానీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కూడా అవకాశం లేకుండా ఆందోళనలు చేస్తే ఎలా? అని ప్రతిపక్షాలపై హోంమంత్రి మండిపడ్డారు. ఈ బిల్లు ఖచ్చితంగా పార్లమెంట్‌లో ఆమోదం పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై విపక్షాల ఆరోపణలను అమిత్ షా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా 2013నాటి ఉదంతాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీపై ధ్వజమెత్తారు. రాజ్యాంగ సవరణ బిల్లులో నైతికత లేదని విపక్షాలు అంటున్నాయి. నాడు లాలూ యాదవ్‌ను కాపాడేందుకు అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ పత్రాలను రాహుల్‌గాంధీ చింపేశారు. ఆ రోజే ఆయన నైతికతతో వ్యవహరిస్తే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేదికాదు. ఈ రాజ్యాంగ సవరణపై కాంగ్రెస్ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోంది. వరుస వైఫల్యాలతో ఆ పార్టీ ఆలోచనావిధానం మందగించి ఉంటుంది. అని కేంద్రమంత్రి ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అంశాన్ని ఆయన ప్రస్తావించారు. ధన్‌ఖడ్‌జీ రాజ్యాంగ పదవిలో కొనసాగారు. ఆయన పదవీకాలంలోఎన్నో మంచి పనులు చేశారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు రాజీనామా చేశారు. ఈ విషయాన్ని మరీ ఎక్కువగా లాగొద్దు. కేవలం ప్రతి పక్షాల ఆరోపణల ఆధారంగా దీనిపై ఓ అంచనాకు రావడం సరికాదుఅని అమిత్ షా స్పష్టంచేశారు. త్వరలో జరగబోయే ఉపరాష్ట్రపతి ఎన్నిక గురించి ప్రస్తావిస్తూ రాష్ట్రపతిని తూర్పు భారతం నుంచి ఎన్నుకున్నాం. ఇప్పుడు ఉపరాష్ట్రపతి దక్షిణాది నుంచి ఉండాలని అనుకున్నాం. దీనికి, తమిళనాడు ఎన్నికలకు ఎలాంటి సంబంధం లేదు అని తెలిపారు.



ఫిజి ప్రధాని సిత్వెని రబుకా సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్మతో భేటీ దృశ్యం

# గాజా ఆస్పత్రిపై ఇజ్రాయెల్ మళ్లీ భీకర దాడులు..

## ముగ్గురు జర్నలిస్టులు సహా 15 మంది మృతి



**టెల్అవీవ్, ఆగస్టు 26:** హమాస్ అంతమే లక్ష్యంగా గత 22 నెలలుగా గాజా నగరంపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. తాజాగా గాజా నగరంలోని పలు ప్రాంతాలపై ఐడిఎఫ్ దాడులకు తెగబడింది. నాజర్ ఆస్పత్రిపై సోమవారం జరిపిన దాడుల్లో ముగ్గురు జర్నలిస్టులు సహా కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా ఆరోగ్య అధికారులు తెలిపారు. ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టుల్లో ఒక రాయిటర్స్‌కు చెందిన హాతేమ్ ఖలీద్, ఓ ఫొటోగ్రాఫర్ అని స్థానిక వార్తాసంస్థ తెలిపింది. 2023 అక్టోబరు 7న మొదలైన ఈ యుద్ధంలో ఇప్పటివరకూ గాజాలో ఇజ్రాయెల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 62 వేలు దాటింది. లక్షలాది మంది గాయపడ్డారు. ఇక ఈ యుద్ధంలో సుమారు 200 మందికిపైగా మీడియా వర్కర్స్ మరణించారు.

**గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం.. 64 మంది మృతి**

గాజా సిటీపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపిస్తోంది. వైమానిక దాడులతోపాటు.. ట్యాంకులతోనూ విరుచుకుపడుతోంది. గత 24 గంటల వ్యవధిలో 64 మంది మృతి చెందారని, 300 మందికి గాయాలయ్యాయని హమాస్‌కు చెందిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. గాజాసిటీ లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్‌కు ఇజ్రాయెల్ 60 వేల మందితో రిజర్వు దళాలను రంగంలోకి దింపింది. మొత్తం గాజాస్ట్రిప్‌ను ఆక్రమించే ఉద్దేశం ఉందని బందీల విడుదలపై హమాస్‌తో పరోక్ష చర్చలు విఫలమైన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్న సంగతి తెలిసిందే. యెమెన్ రాజధాని సనాపై ఇజ్రాయెల్ ఆదివారం దాడులు చేసింది. ఓ విద్యుత్‌కేంద్రం, గ్యాస్ స్టేషన్‌పాటు రాజధాని వ్యాప్తంగా వివిధ ప్రాంతాలపై బాంబుల కురిపించింది.



# రాజస్థాన్‌లో భారీ వరదలు

## రెండు కిలోమీటర్ల మేర గొయ్యి!

**జైపూర్, ఆగస్టు 26:** గతకొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజస్థాన్‌లో భారీ వరదలు పోటెత్తాయి. వర్షాల వల్ల సుర్వాల్ జలాశయం పొంగి పొర్లటంతో రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపుర్ గ్రామంలో 2కిలోమీటర్ల మేర గొయ్యి ఏర్పడి జలపాతాన్ని తలపిస్తోంది. పొలాల మీదుగా నిరు ఉధృతంగా ప్రవహించి జదవత గ్రామాన్ని ముంచెత్తడంతో విధ్వంసం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. సవాయ్ మాధోపుర్‌లో 2 కిలోమీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పు, 55 అడుగుల లోతున బిలం ఏర్పడడంతో గ్రామా నికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వర్షం ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందన్నారు. నీటి ఉధృతికి రెండు ఇళ్లు, పలుదుకాణాలు, రెండు దేవాలయాలుకూలినట్లు అధికారులు తెలిపారు. పోలీసులు, భద్రతా బలగాలు సహాయక చర్యలు చేపడుతున్నారు. సమీపంలోని ఇళ్లను ఖాళీ చేయించి గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కరోడి లాల్ మీనా పేర్కొన్నారు. బిలంలోకి చేరుకున్న నీటిని యంత్రాల సహాయంతో మళ్లించాలని అధికారులను ఆదేశించారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నేల కోతను ఆపడం అసాధ్యమన్నారు. ఇదే విధంగా రాష్ట్రంలోని పలు గ్రామాలు వరద నీటిలో మునిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. నిమోడా అనే గ్రామంలో దాదాపు 400 ఇళ్లు కూలిపోవడంతో అక్కడి ప్రజలు నిరాశ్రయులయ్యారని వారిని సహాయక శిబిరాలకు తరలించామని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సైన్యం, జాతీయ రాష్ట్ర విపత్తు సహాయ దళాలు సహాయక చర్యలు అందిస్తున్నాయన్నారు.

# అమెరికాలో లాబీయింగ్‌కు భారత్ ముమ్మర యత్నాలు!



**వాషింగ్టన్, ఆగస్టు 26:** అమెరికా విధించిన అదనపు సుంకాలు అమల్లోకి రావడానికి కొన్ని రోజులముందే భారత్ లాబీయింగ్ యత్నాలను ముమ్మరం చేసింది. ఈ క్రమంలో అక్కడి ప్రభుత్వంతో వ్యూహాత్మక అంశాల్లో కమ్యూనికేషన్లు నిర్వహించడం, సోషల్ మీడియా, మీడియా రిలేషన్స్, డిజిటల్ ఆడిట్ వంటివాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక సంస్థను నియమించుకొంది. ఫారెన్ ఏజెంట్ రిజిస్ట్రేషన్ ఫైలింగ్ ప్రకారం.. భారత దౌత్య కారాలయం నెలకు 75,000 డాలర్లు చెల్లించేలా మూడు నెలలకు మెర్క్యురీ పబ్లిక్ అఫైర్స్ సంస్థతో ఒప్పందం చేసుకొంది. ఇది ఈ నెల 15 నుంచి అమలులోకి వచ్చింది. మెర్క్యురీ సంస్థ మాజీ రిపబ్లికన్ సెనెటర్ డేవిడ్ విట్టర్, 2020 ట్రంప్ ట్రాన్సిషన్ బృందం కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా చేసిన బ్రయాన్‌తో కలిసి భారత్ కోసం పనిచేస్తుంది. న్యూయార్క్ రాష్ట్రానికి సెనెటర్‌గా ఎన్నికైన తొలి ఇండో-అమెరికన్ కెవిన్ థామస్ సాయం చేయనున్నారు. ప్రస్తుతం ట్రంప్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సూసీ విలిస్ మెర్క్యురీ సంస్థతో సంబంధాలున్నాయి. 2024వరకు ఆమె ఈ సంస్థకోసం రిజిస్టర్డ్ లాబీయిస్ట్‌గా పనిచేశారు. ఆ తర్వాత శ్వేతసౌధంలో బాధ్యతలు చేపట్టారు. బ్రయాన్ గతంలో ట్రంప్ ప్రచార బృందంలో, జెడివాన్స్ సెనెట్‌కు పోటీ చేసినప్పుడు పనిచేశారు. విమర్శలు వచ్చాక.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత పాకిస్థాన్ చాలా వేగంగా ఆయనతో సంబంధాలను బలోపేతం చేసుకొంది. భారత్ మాత్రం కొంత వెనకబడిందనే విమర్శలు వచ్చాయి. ఇక పాక్ నాయకత్వం ట్రంప్ మాజీ బాడీగార్డ్ కీత్ షల్లర్ నిర్వహిస్తున్న లాబీయింగ్ సంస్థను నియమించుకొంది. మరోవైపు భారత్ ఇప్పటికే ట్రంప్ మాజీ సహాయకుడు జేసన్ మిల్లర్‌కు చెందిన ఎస్‌హెచ్‌డబ్ల్యు పార్టనర్స్ ఎల్‌ఎల్‌సిని నియమించుకొని నెలకు 1.50 లక్షల డాలర్లు చెల్లిస్తున్నాం. అమెరికాలో కీలకమైన ఒప్పందాలు, ఇతర పనులను పూర్తి చేసుకోవడానికి లాబీయింగ్ సంస్థలను నియమించుకోవడం కొత్తేమీ కాదు. చాలా దేశాలు వీటితో కలిసి పనిచేస్తుంటాయి.

**రష్యాను అదుపు చేయడానికే భారత్‌పై చర్యలు..**

రష్యా దూకుడును అదుపు చేయడానికి ట్రంప్ సర్కారు చాలా చర్యలు తీసుకొందని ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ వెల్లడించారు. దీనిలో భాగంగానే భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు విధించినట్లు పేర్కొన్నారు. ఆయన ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు.

# ఎక్కడ తక్కువకు వస్తే అక్కడే చమురు కొంటాం

## రష్యాలో భారత్ దౌత్యవేత్త వినయ్‌కుమార్ స్పష్టీకరణ



**మాస్కో ఆగస్టు 26:** రష్యా నుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. రష్యాతో ఆయిల్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని కొన్ని నెలల క్రితమే ట్రంప్ హెచ్చరించారు. భారత్, రష్యానుంచి క్రూడ్ ఆయిల్ కొనటం అంటే.. ఇక్రెయిన్‌పై యుద్ధం చేయడానికి రష్యాకు నిధులు సమకూరుస్తున్నట్లే అని ఆయన అన్నారు. ట్రంప్ హెచ్చరికల్ని భారత్ ఏమాత్రం లెక్కచేయలేదు. రష్యా నుంచి క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటూ ఉంది. దీంతో ట్రంప్ ఆగ్రహానికి గురయ్యారు. ఏకంగా 50 శాతం టారిఫ్ విధించారు. అయినా కూడా భారత్ వెనక్కు తగ్గలేదు. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ వారం రోజుల క్రితం మాట్లాడారు. తాము ఎవరి బెదిరింపులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. తమకు భారత ప్రజల ప్రయోజనాలే ముఖ్యం అని అన్నారు. ఈనేపథ్యంలోనే రష్యాతన మిత్ర దేశం భారత్‌కు బంపర్ ఆఫర్ ఇచ్చింది. క్రూడ్ ఆయిల్‌పై5శాతం డిస్కౌంట్ ప్రకటించింది.

**ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాం..**

రష్యానుంచి భారత్ క్రూడ్ ఆయిల్ దిగుమతి చేసుకోవటంపై రష్యాలోని భారత అంబాసిడర్ వినయ్‌కుమార్ స్పందించారు.

తాజాగా, రష్యా ప్రభుత్వ మీడియా టాస్ ఏజెన్సీకి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'దేశంలోని ఆయిల్ కంపెనీలు ఆయిల్ ఎక్కడ తక్కువకు దొరికితే అక్కడే కొంటాయి.

భారత ప్రభుత్వానికి దేశప్రజల ప్రయోజనాలే ముఖ్యం.

ప్రజలకు సరిపడా ఆయిల్ అందించ డానికి తగిన చర్యలు తీసుకుంటుంది. రష్యాతో పాటు పలుదేశాలకు భారత్ పర స్పరసహకారం అందించటంవల్ల జాతీయ ఆయిల్ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ ఆయిల్ మార్కెట్ నిలకడగా ఉంది. అంతెందుకు.. రష్యాతో అమెరికాకూడా వ్యాపారాలు చేస్తోంది కదా..' అని అన్నారు.

# రష్యాలో భారత్ కార్మికులకు డిమాండ్

**మాస్కో, ఆగస్టు 26:** రష్యాలో భారత కార్మిక శక్తికి డిమాండ్ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. రష్యన్ కంపెనీలు.. ముఖ్యంగా యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోని సంస్థలు భారతీయులను నియమించుకునేందుకు ఆసక్తి చూపుతున్నట్లు అక్కడి భారత రాయబారి వినయ్‌కుమార్ తెలిపారు. రష్యాలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు భారతీయుల సంఖ్య పెరుగుతుండటంతో కాన్సులర్‌సేవలను మరింత విస్తరిస్తున్నట్లు చెప్పారు. అమెరికా, బ్రిటన్ తదితర పాశ్చాత్య దేశాలు వలసలపై ఆంక్షలు విధిస్తున్న వేళ.. ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'రష్యాలో మానవ వనరుల అవసరం ఉంది. భారత్ వద్ద నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉంది. ఈ క్రమంలోనే స్థానిక చట్టాలను అనుసరించి కంపెనీలు భారతీయులను నియమించుకుంటున్నాయి. ఇక్కడికి వచ్చిన వారిలో ఎక్కువ మంది నిర్మాణ, వస్త్రరంగాల్లో ఉపాధి పొందుతున్నారు. యంత్రాలు, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో భారతీయులకు డిమాండ్ పెరుగుతోంది' అని ఓ వార్తాసంస్థ ఇంటర్వ్యూలో వినయ్‌కుమార్ వెల్లడించారు.

స్థానికంగా భారతీయ కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో.. పాస్‌పోర్ట్ పొడి గింపు వంటి కాన్సులర్ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ యుద్ధానికితోడు యువ రష్యన్లు ఫ్యాక్టరీల్లో పనిచేసేందుకు విముఖత చూపుతుండటం వంటి కారణాలతో.. 2030 కల్లా రష్యాలో 31 లక్షల మంది కార్మికులకు కొరత ఏర్పడనున్నట్లు అంచానా.

ఈ నేపథ్యంలో ఇక్కడి పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మిక కొరతను తీర్చడానికి ఈ యేడాది చివరికల్లా నిపుణులైన 10 లక్షల మంది భారతీయ కార్మికులను తీసుకోవాలని మాస్కో వ్యూహకర్తలు భావిస్తున్నట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి.

# వివాదాస్పదంగా గోర్ నియామకం

## భారత్-అమెరికా మధ్య ట్రంప్ పెట్టిన మరో చిచ్చు



**వాషింగ్టన్, ఆగస్టు 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు భారత్-అమెరికా సంబంధాలను తీవ్రస్థాయిలో దెబ్బతీస్తున్నాయి. తాజాగా అత్యంత వివాదాస్పదమైన వ్యక్తుల్లో ఒకరైన సెర్గియో గోర్‌ను భారత్‌లో అమెరికా రాయబారిగా, దక్షిణ, మధ్య ఆసియాలో పర్యవేక్షకుడిగా నియమించడం దౌత్య వర్గాలను షాక్‌కు గురిచేసింది. ఒకప్పుడు భారత్ తీవ్రంగా వ్యతిరేకించిన పనినే ట్రంప్ బలవంతంగా చేశారు. 38 యేళ్ల గోర్‌పై ట్రంప్‌నకు విపరీత మైన నమ్మకం ఉంది. ఇతడు చెప్పిన మీదటే నాసా చీఫ్ నియామకాన్ని చివరి నిమిషంలో మార్చేశారు.

**భారత్ ప్రాధాన్యం తగ్గించినట్లా?**

గోర్ నియామకంపై భారత్‌లో మిశ్రమ స్పందన వస్తోంది. విదేశీ వ్యవహారాల నిపుణుడు, మాజీ దౌత్యవేత్త కన్వల్ సిబల్ స్పందిస్తూ భారత్‌లో నియమించిన దౌత్యవేత్తను దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా నియమించడం ఇదే తొలిసారి అని అన్నారు. పాకిస్థాన్‌సహా పొరుగు దేశాలతో భారత్‌కు ఉన్న సంబంధాలను అతడు గమనిస్తాడన్నది వాస్తవమని పేర్కొన్నారు. అయితే.. ఈచర్య భారత్, పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టినట్లవుతుందని.. ఇలాంటి అమెరికా వైఖరిని న్యూఢిల్లీ గతంలో తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. అంతేకాదు.. ఇక భారత్-అమెరికా సంబంధాల్లో ఇండో-పసిఫిక్ ప్రాధాన్యం కనుమరుగవుతుందని చెప్పారు. ఇకపోతే.. మరో మాజీ దౌత్యవేత్త నిరుపమారావ్ కూడా ట్రంప్ ఉద్దేశాలను ప్రశ్నించారు. ఈ నియమాకం భారత్-అమెరికా సంబంధాలను దెబ్బతీస్తుందన్నారు. గోర్ దౌత్యవేత్త కాకపోవడం, భారత్, దక్షిణాసియాలో అతడికి అనుభవం లేకపోవడం ఇబ్బందికరమన్నారు. కేవలం వీరవిధేయతే ఏకైక అర్హతన్నారు. అధ్యక్షడి అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే అతడిని నియమించారన్నారు. అది భారత్‌తో సంబంధాలను కూడా కలపడం ఇబ్బందికరమే అనితెలిపారు. వ్యక్తిగతంగా తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తిని భారత్‌లో నియమించి ట్రంప్ నుంచి మోడీ ప్రభుత్వానికి బలమైన సంకేతాలు వెళ్లాయని పొలిటికో పత్రిక పేర్కొంది. అధ్యక్షుడి నుంచి వచ్చే అభ్యంతరాలు, ఇతరసందేశాలపై భారత్ కూడా తీవ్రంగా పరిగణించి.. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

**నాడు ఒబామా ప్రయత్నాన్ని వ్యతిరేకించిన భారత్..**

2009లో బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా భారత్-పాక్-అఫ్ఘానిస్థాన్‌ను ఒకే పాలసీ కిందకు తెచ్చేందుకు యత్నించారు. నాడు రిచర్డ్ హోల్‌బ్రూక్‌ను ఈ ప్రాంతం మొత్తానికి ప్రత్యేక రాయబారిగా నియమించారు. అయితే.. నాటి భారత విదేశాంగ మంత్రి ప్రణబ్ ముఖర్జీ దీనిపై అమెరికా రాయబారి డేవిడ్ మల్‌ఫోర్డుకు తమ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ చర్య భారత్‌కు ఆమోదయోగ్యం కాదన్నారు. దీంతో నాడు బ్రూక్‌ను పాక్-అఫ్ఘానిస్థాన్‌కు మాత్రమే పరిమితం చేసినట్లు వికీలీక్స్‌లో బహిర్గమైన పత్రాల్లో తేలింది. ఇప్పుడు ట్రంప్ భారత్‌కు నచ్చని అటువంటి చర్యే తీసుకొన్నారు.

**ట్రంప్-మస్క్ వివాదాన్ని ఎగదోసి..**

శ్వేతసౌధంలో ట్రంప్ వ్యక్తిగత కార్యదర్శి హోదాలో అమెరికా ప్రభుత్వంలో ఏకంగా 4,000 నియామకాలు చేశారంటే.. గోర్ పరపతిని అర్థం చేసుకోవచ్చు. మస్క్ దోస్త్ జరేడ్ ఇస్సాక్‌మన్ సాసా చీఫ్‌గా తొలుత ప్రకటించారు. ఆయన నామినేషన్ ఆమోదం కోసం సెనేట్‌కు పంపే సమయంలో మస్క్-ట్రంప్ విభేదాలు తీవ్రస్థాయిలోఉన్నాయి. అదేసమయంలో ఇస్సాక్‌మన్ డెమోక్రాట్లకు ఎన్నికల్లో నిధులు సమకూర్చినట్లు గోర్ నుంచి అధ్యక్షుడికి సమాచారం వెళ్లింది. దీంతో డోజ్ అధిపతిగా ఉన్న మస్క్ చివరిరోజున.. నాసా చీఫ్‌పదవి నుంచి ఇస్సాక్‌మన్ పేరును ట్రంప్ తొలగించారు. ఈ నేపథ్యంలో గోర్‌ను 'పాము'గా అభివర్ణిస్తూ మస్క్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఇక సెనేట్‌లో ఆమోదముద్ర పడితే గోర్ భారత్‌కు రావడం ఖాయమవుతుంది. ఇది కూడా అంత ఈజీ ఏమీకాదు. బైడెన్ ప్రభుత్వం నియమించిన ఎరిక్ గార్సెట్టీకి సెనెట్ ఆమోదముద్ర వేయడంలో తీవ్ర జాప్యం చేసింది. దీంతో ఆన చివరి రెండేళ్లు మాత్రమే భారత్‌లో పనిచేశారు.

# సంక్షిప్తంగా..

## ఇడి దాడులతో గోడదూకబోయిన ఎమ్మెల్యే



**కోల్‌కతా, ఆగస్టు 26:** పశ్చిమబెంగాల్ రాజకీయాలను కుదిపేసిన ఉపాధ్యాయ నియామక కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పలువురు నేతల ఇళ్లపై దాడులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఇడి అధికారులు ముర్షిదాబాద్ జిల్లాలోని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే జిబన్ కృష్ణ సాహా నివాసం సహా ఆయనకు సంబంధించిన పలు ప్రదేశాలపై దాడులు నిర్వహించారు. అయితే సోదాల గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే తమ ఇంటి మొదటి అంతస్తు నుంచి కిందకు దూకి గోడ దూకి పారిపోయేందుకు యత్నించారు. ఇంటి బయట కాపలా అధికారులు కృష్ణ సాహాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. పారిపోయే క్రమంలో ఎమ్మెల్యే తన వద్ద ఉన్న సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు తన మొబైల్ ఫోన్‌ను ఇంటికి సమీపంలోని చెరువులోకి విసిరేసినట్లు అధికారులు తెలిపారు. మరో రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపామన్నారు. ఇంటి నుంచి పారిపోవడానికి ఎందుకు ప్రయత్నించారనే విషయంపై కృష్ణ సాహాను విచారిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో 2023 ఏప్రిల్‌లో సిబిఐ అధికారులు కృష్ణ సాహాను అరెస్టు చేశారని, 2025 మేలో ఆయనకు బెయిల్ మంజూరయిందని తెలిపారు. ప్రభుత్వ ప్రాయోజిత, ఎయిడెడ్ పాఠశాలల్లో 9 నుంచి 12 తరగతులకు ఉపాధ్యాయులతో పాటు గ్రూప్ సి, గ్రూప్ డి స్టాఫ్ సిబ్బంది నియామకాల కోసం 2016లో బెంగాల్ సర్కార్ రాష్ట్ర స్థాయి సెలక్షన్ పరీక్ష నిర్వహించింది. 24,650 ఖాళీల భర్తీ కోసం చేపట్టిన ఈ రిక్రూట్‌మెంట్ పరీక్షను 23 లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## నటి ఆరోపణలు.. ఎమ్మెల్యేను సస్పెండ్ చేసిన కాంగ్రెస్



**తిరువనంతపురం, ఆగస్టు 26:** కేరళ కాంగ్రెస్‌లో ఓ నటి చేసిన ఆరోపణలు కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీ అతనిపై చర్యలు చేపట్టింది. ఎమ్మెల్యే రాహుల్ మామకుటత్తిల్‌ను ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేసింది. ఆయన పాలక్కాడ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఓ ప్రముఖ పార్టీకి చెందిన యువనేత తనతో అనుచితంగా వ్యవహరిస్తు న్నాడని, మూడేళ్లుగా వేధిస్తున్నారంటూ రీని జార్జ్ అనే నటి ఓ ఇంటర్వ్యూలో ఆరోపించారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆ పార్టీ సీనియర్ల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోయారు. రాహుల్ పేరును ఆమెనేరుగా ప్రస్తావించనప్పటికీ బిజెపి, సిపిఎం శ్రేణులు ఆయన ప్రమేయం ఉందని ఆరోపించాయి. రాజీనామా చేయాలని నిరసనలు చేపట్టాయి. ఈ నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా ప్రకటించారు. నాపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడాను. వారెవరూ నన్ను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదు. ఆ నటి నా స్నేహితురాలు. ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి నేనేకాదని నమ్ముతున్నాను. నేను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదుఅని రాజీనామా అనంతరం పేర్కొన్న సంగతి తెలిసిందే. అయినా విమర్శలు ఆగకపోవడంతో ఇప్పుడు పార్టీ చర్యలు తీసుకుంది.

## యుపిలో ట్రాక్టర్, కంటైనర్ ఢీ: 8 మంది మృతి

**లక్నో ఆగస్టు 26:** ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహార్ జిల్లా ఘటల్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదివారం రాత్రి 2.15 గంటల సమయంలో 34వ జాతీయ రహదారిపై బులంద్‌షహార్, అలీగఢ్ సరిహద్దుల్లోని ఘటల్ వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ కంటైనర్ అదుపుతప్పి గోగాజీ భక్తులతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో 8 మంది మృతి చెందారు. మరో 43 మంది గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఓ చిన్నారి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను దవాఖానకు తరలించారు. బాధితులు యూపీలోని కాస్గంజ్ నుంచి రాజస్థాన్‌లోని గోగామేడికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 43మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. క్రేన్ సహాయంతో ప్రమాదానికి గురైన ట్రాక్టర్‌ను ఘటనా స్థలం నుంచి తొలగించామన్నారు. ట్రక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ఎమ్మెల్యే నసీర్ వినాయకచవితి శుభాకాంక్షలు



**○ పందిళ్లకు ఉచిత విద్యుత్ అందించడంపై హర్షం**

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో వినాయకచవితి పండుగ వేడుకలు నిర్వహించుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా వినాయకచవితి పందిళ్లకు ఉచితంగా విద్యుత్ అందించడం చరిత్రలో ఇదే మొదటిసారి అని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరఫున సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. పండుగ తొలి రోజు నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి విఘ్నాలు లేకుండా నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరికీ గణనాథుని నిండు ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

## ఎల్వోసీ చెక్కు అందజేత



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** అనారోగ్యంతో బాధపడుతున్న మంగళగిరి మండలం, పెదవడ్లపూడి కి చెందిన మునునూరి గోపాలరావు కు మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 4,50,000 విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ) ముంజూరైంది. టీడీపీ నాయకులు బాధితుని ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ఎల్వోసీ చెక్కురావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్ కు బాధితుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్,మాదల రమేష్ బాబు, అన్నే చంద్రశేఖర్,జాలాది సందీప్, మొద్దుకూరి రమేష్, బొర్రా శ్రీకాంత్,కొప్పాక ఓంకార్, గుంటూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరత అనేది దుష్ప్రచారం ఎవరు నమ్మొద్దు



**○ ఎన్డీఏ కూటమి రైతులకు అండగా ఉంటుంది: డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు**


**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గంలో నారాకోడూరు చేబ్రోలు మండలాల్లో డీసీఎంఎస్ కేంద్రాలను పరిశీలించి అనంతరం వారు మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్లో రైతులు ఎవరు నష్టపోకుండా ఉండేందుకు కేంద్రమంత్రి పెమ్మసాని చొరవతో యూరియా డిఏపి ఎరువులు మార్క్ఫెడ్ ద్వారా అధిక మొత్తంలో నిలువలు పెంచి రైతు సోదరులకు సబ్సిడీ ధరకే ఎరువులు అందిస్తామని రైతులు ఎవరైనా అవాస్తవాలు నమ్మవద్దని కూటమి ప్రభుత్వం రైతులకు ఎప్పుడు అండదండలుగా ఉంటుందని యూరియా కొరత అనేది జిల్లాలో ఎక్కడ జరగకుండా జాగ్రత్తలు వహిస్తూ రైతులకు అండగా ఉంటానని వారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ ప్రెసిడెంట్ మైల రాజు,జనసేన మండల పార్టీ ప్రెసిడెంట్ చందు శ్రీరాములు, నారాకోడూరు గ్రామ పార్టీ ప్రెసిడెంట్ వెలగా పవన్, మండల తెలుగు యువత అధ్యక్షులు యందురి అనిల్, గ్రామ వైస్ ప్రెసిడెంట్ వెలగా సాంబశివరావు బండ్లమూడి జ్యోతి బాబు రియాజ్ మండలనేని శ్రీనివాసరావు పాలడుగు రాంబాబు,దంతాల శ్రీనివాసరావు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ వైకుంఠపురం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** వినాయక మట్టి ప్రతిమలను పూజించడం ద్వారా పర్యావరణ పరిరక్షకులుగా భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని రోటరీ క్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పేర్కొన్నారు.

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మహాగణపతిని పూజించే భక్తులకు, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం కార్యవర్గము ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ కూడళ్ళలో మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. రోటరీ వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో, శివాజీ చౌక్, గంగానమ్మపేట, ఎం ఎం జ్యువెలర్స్ ప్రాంతాల్లో విగ్రహాలు పంపిణీ చేపట్టారు. గంగానమ్మపేటలో విగ్రహాలు పంపిణీ మున్సిపల్ కమిషనర్ వి ఎం లక్ష్మీపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం శుభ పరిణామం అన్నారు. గణపతిని పూజించే భక్తులు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కోరారు. లక్ష్మీప్రియా జ్యువెలర్స్ వద్ద మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట్ వెంకట పూర్ణచంద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రోటరీ వైకుంఠపురం సభ్యులు పాల్గొన్నారు.

## మూడు రోజులు త్రాగునీటి సరఫరాకు అంతరాయం



గుంటూరు, ఆగస్టు 26 : గుంటూరు నగరంలో ఈ నెల 31వ తేదీ నుండి సెప్టెంబర్ 2వ తేదీ వరకు త్రాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ నగర్ పంప్ హౌస్%-%సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద 900 ఎంఎం డయా పైప్‌లైన్ ఇంటర్ కనెక్షన్ పనుల కారణంగా తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్సులోని ఫిల్టరేషన్ పాయింట్ నిలిపివేయాల్సి వస్తుందని ఆయన చెప్పారు. ఫలితంగా ఆగస్టు 31 సాయంత్రం నుండి సెప్టెంబర్ 2 ఉదయం వరకు సరఫరా ఉండదని, 2వ తేదీ సాయంత్రం నుండి పాక్షికంగా, 3వ తేదీ ఉదయం నుండి పూర్తిస్థాయిలో సరఫరా పునరుద్ధరించబడుతుందని వెల్లడించారు. ఈ పనుల వలన హెచ్ఎల్ఆర్, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, ఏటి అగ్రహారం, ఏఎంసి, హౌసింగ్ బోర్డ్ కాలనీ, కోర్ట్ కాంపౌండ్, కెవిపి కాలనీ, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్, నెహ్రూ నగర్, రాజీవ్ గాంధీ నగర్, బొంగరాలబీడు, వసంతరాయపురం, శారదా కాలనీ, రెడ్డిపాలెం, గోరంట్ల తదితర ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని కమిషనర్ తెలిపారు. కావున నగర ప్రజలు ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

## పత్రీ, పూజా సామాగ్రీ విక్రయాలతో వ్యాపారకూడళ్ళలో గణపతి పప్పా సందడే... సందడి

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్)** సిద్ధి బుద్ధి గణపతి శిరసా నమామి అంటూ,మముగాచే గణపతి మనసా స్మరామి అంటూ,సర్వవిఘ్నముల నుండి సదా కాపాడాలని, విఘ్న గణపతిని కొలిచేందుకు పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు, పత్రీ, పూలు, పళ్ళు, పూజా సామగ్రీ కొనుగోలుకు సమాయత్తమయ్యారు.

**వినాయక చతుర్థి పర్వదిన సందర్భంగా ఆబాల గోపాలం** భక్తి ప్రపత్తులతో, గణపతిని కొలిచేందుకు అవసరమైన, పత్రి, వివిధ రకాల, ఫలాలు, పుష్పాలు,పూజ సామగ్రి విక్రయాలు, పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలిలో మంగళవారం ఉదయం నుండి,కొనసాగుతున్నాయి.

తెనాలి పరిసర గ్రామాలనుండి పత్రి, అరటి పిలకలు, వివిధ రకాల పత్రాలు, వాహనాల ద్వారా పట్టణ ప్రధాన కూడళ్ళకు తీసుకువచ్చి,అమ్మ కాలకు సిద్ధం చేశారు. గణపతి విగ్రహమూర్తులను వివిధ సైజులలో, విక్రయాలకు సిద్ధం చేశారు. గణపతి పప్పా మోరియా అంటూ , పట్టణములోని ప్రధాన కూడళ్ళలో, గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లను ముమ్మరంచేశారు. హైందవ సమాజంలో ప్రతి ఇంటా ఎంతో భక్తి ప్రపత్తులతో నిర్వహించుకుని తొలి పండుగగా





వినాయక చవితి ప్రాధాన్యతను సంతరించుకున్న, క్రమంలో, పత్రి కొనుగోళ్లకు ప్రజలు ప్రధాన కూడళ్ళకు చేరుకోవడంతో, పట్టణమంతా గణపతి ఉత్సవ శోభతొ,సందడి వాతావరణం చోటు చేసుకుంది. మరో వైపు, తెనాలి పట్టణ శివారు, తెనాలి, విజయవాడ రహదారిలో, కొలువైయున్న, 60,అడుగుల మహాగణతి, సన్నిధానంలో, చవితి, ఉత్సవాల నిర్వాహణకు, గణపతి స్వామి సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యారు. వక్రతుండ మహాకాయ,కోటి సూర్య సమప్రభ, నిర్విఘ్నం కురుమేదేవ, అని స్మరిస్తు,గణపతి నవరాత్రోత్సవాలు ఎటువంటి విఘ్నాలు లేకుండా కొనసాగాలని, సర్వులకు శ్రీ మహాగణపతి దివ్యానుగ్రహం లభించాలని ఆశిద్దాం.

## ప్రజా ఆరోగ్య రక్షణలో స్వచ్ఛంద సంస్థల పాత్ర సమాజానికి ఆదర్శం

**○ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేతులమీదుగా ఉచిత మెగా వైద్య శిబిరం ప్రారంభం**



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 28వ డివిజన్ వేణుగోపాల్ నగర్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ అండ్ గాస్పెల్ మిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి ప్రారంభించారు. ఆమె శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ప్రజలకు సేవల అందుబాటులో ఉండటం మరియు సమగ్ర వైద్య సదుపాయాలు అందించడం కోసం నిర్వహించిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ విధమైన ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అత్యంత అభినందనీయమని తెలిపారు. బ్లడ్ పరీక్షలు చేయించుకోలేని నిరుపేదలకు ఈ శిబిరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని, ఆధునిక మొబైల్ మెడికల్ క్లినిక్ ద్వారా నిమిషాల్లోనే వైద్య పరీక్షల రిపోర్టులు అందించడం ఒక గొప్ప విశేషమని పేర్కొన్నారు. వైద్యం రోజురోజుకు ఖరీదవుతున్న ఈ రోజుల్లో, సామాజిక బాధ్యతగా స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం సమాజానికి ఆదర్శమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు.

ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, డెంటల్, పీడియాట్రిక్, ఐ & స్కిన్ విభాగాల్లో వైద్య సేవలు అందించబడ్డాయి. బ్లడ్ ప్రెషర్, షుగర్, ECG, హీమోగ్లోబిన్, లివర్ & కిడ్నీ ఫంక్షన్ వంటి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించబడ్డాయి. అలాగే, నిరుపేదలకు ఉచితంగా మందుల పంపిణీ చేయడం, ఆరోగ్యంపై అవగాహన కలిగించే ప్రత్యేక హెల్త్ కౌన్సిలింగ్ కూడా ఈ శిబిరంలో ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ టిడిపి అధ్యక్షులు ఏపీ యాదవ్, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జీవన్, మామిడి రామారావు, నల్లూరి శ్రీనివాసరావు, పగడాల రాము, చిరంజీవి, ప్రసాద్, శ్రీహరి, బుడే తదితరులు పాల్గొన్నారు.

## జీజీహెచ్ అభివృద్ధికి ఎమ్మెల్యే నసీర్ ముందడుగు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రానికే తలమానికమైన గుంటూరు ప్రభుత్వాస్పత్రి సమగ్ర అభివృద్ధి కోసం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. పేద రోగులకు సంజీవనిగా ఉన్న ఈ ఆస్పత్రిలో వైద్య సదుపాయాల మెరుగుదల కోసం ఇప్పటికే అనేక సార్లు వైద్య శాఖ మంత్రితోపాటు వైద్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీని కలిసి ఎమ్మెల్యే నసీర్.. మంగళవారం సెక్రటేరియట్ లో మరోసారి మంత్రి సత్యకుమార్ కు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో పేద రోగులకు అత్యంత కీలకమైన వైద్య సేవలందిస్తోన్న గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఇప్పటి వరకు సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రి సత్యకుమార్ అందిస్తోన్న సహకారానికి ధన్యవాదాలు తెలిపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యశాలలను బలోపేతం చేస్తూ తీసుకున్న నిర్ణయాలతో జీజీహెచ్ లో రోగులకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేస్తున్నామని వివరించారు. ఈ క్రమంలో మార్కాపురం పీడియాట్రిక్ సర్జరీ సెంటర్ లో హెచ్ డీ ల్యాప్‌టాప్ సెట్, లాపరోస్కోపిక్ ఇన్‌స్ట్రుమెంట్ సెట్, మదనపల్లె జీజీహెచ్ లోని పిల్లల శస్త్రచికిత్స నిపుణులు లేనందున అక్కడ హెచ్ డీ ల్యాప్ సెట్‌లు నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని జీజీహెచ్ కు తరలించాలని కోరారు. నెల్లూరులో 80 సిరంజి పంపులు ఉపయోగంలో లేవని, వీటిలో 50 గుంటూరు జీజీహెచ్ కు అందించాలని విన్నవించారు. కార్డియాక్ డయాగ్నస్టిక్ సేవల బలోపేతానికి ఆప్టికల్ కోహెరెన్స్ టోమోగ్రఫీ, ఫ్రాక్షనల్ ఫ్లో రిజర్వ్ పరికరాలు అవసరమని తెలిపారు. ట్రామా కేర్ సేవలను వేగవంతం చేయడానికి డెక్కన్ కంపెనీ ఆర్థో ట్రామా బ్లాక్ పరికరాల సేకరణ వేగవంతం చేయాలని కోరారు. ఆస్పత్రిలో అత్యవసర మరమ్మతులు, నిర్వహణ పనుల కోసం రూ. 4.5 కోట్ల నిర్వహణ బడ్జెట్‌ను విడుదల చేయాలని విన్నవించారు. జీజీహెచ్‌లో రోగులకు సేవలందించేందుకు FNO/MNO 120 పోస్టులు అవసరమని, వీటిలో 62 మంది సభ్యులకు ఆమోదం ఫైలు సెక్రటేరియట్ స్థాయిలో పెండింగ్‌లో ఉందని తెలిపారు. మరో అనస్థీషియా యూనిట్ అవసరమని, ప్రతి యూనిట్‌లో 1 ప్రొఫెసర్, 5 అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఈ సౌకర్యాల కల్పన ద్వారా జీజీహెచ్ లో మరింత వైద్య సేవలందించవచ్చని విన్నవించారు. ఎమ్మెల్యే నసీర్ విన్నవించిన అంశాలపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ త్వరలో జీజీహెచ్ కు తగిన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## లోకేష్ సొంత నిధులతో గంగానమ్మ ఆలయంలో బోర్ ఏర్పాటు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి: ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో ఆత్మకూరు గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ ఆలయంలో బోర్ ఏర్పాటు చేయించారు. ఆలయంలో నీటి సౌకర్యం లేక భక్తులు ఇబ్బందులను గ్రామస్తులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే రూ. లక్షా 50 వేలతో బోర్ ఏర్పాటు చేయించారు. అలాగే ఇదే గుడిలో ఉత్సవానికి 8 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు, దీనితో గ్రామస్తులు మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడూతూ మంత్రి నారా లోకేష్ తాగునీటి సమస్యలున్న ప్రాంతాలలో నీటి సమస్యలు తలెత్తకుండా స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు జలధార పేరుతో మినరల్ వాటర్ ప్లాంట్లు, తాగునీటి బోర్లు ఏర్పాటు చేయిస్తూ తాగునీటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లబోతుల శ్రీనివాసరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి వెంకట్రావు, తెలుగుదేశం పార్టీ మండల ఉపాధ్యక్షులు కొమ్మ సుకుమార్, బూత్ కన్వీనర్ మాన్యం సుబ్బారావు, గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి శానం మాణిక్యరావు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ తాత కోటయ్య, నీటి సంఘాల నెంబరు మాన్యం ఏడుకొండలు, బూత్ కన్వీనర్ గద్దె రామస్వామి, టిడిపి సీనియర్ నాయకులు గద్దె రాజరాజేశ్వరావు, గ్రామ ఉపాధ్యక్షులు పడమటి దుర్గారావు, వేణుగోపాలస్వామి చైర్మన్ మోతుకూరి రవి కుమార్, వేణుగోపాల్ స్వామి నెంబర్లు మాన్యం సాంబయ్య, కుందే రామాంజనేయులు, శివాలయం టెస్ట్ బోర్డ్ నెంబరు జొన్నకూటి శ్రీనివాసరావు, బిజెపి సీనియర్ నాయకుడు బొమ్ము శంకర్ రెడ్డి, జాలాది నాగేశ్వరావు, తాటిపాముల ఆదిశేషు, గంగానమ్మ తల్లి గుడి పూజారి జొన్నకూటి సాంబశివరావు, పడమటి పుల్లారావు, యార్లగడ్డ సాంబశివరావు, తమ్మిశెట్టి రమణయ్య, బిట్రా మోహన్, ఆకాశం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అంతరాలు అధిగమించేందుకు సహకార వ్యవస్థ బలోపేతం కావాలి

**○ విశాఖపట్నం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ జెవి. సత్యనారాయణమూర్తి**



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక అంతరాల తొలగింపుకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కారమని ది,విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ జెవి సత్యనారాయణ మూర్తి, తెనాలిలో తమశాఖ ప్రారంభ సందర్భంగా పేర్కొన్నారు. విశాఖపట్నం ద్వారకా నగర్ ప్రధాన కేంద్రంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 56 బ్రాంచీలతో దక్షిణ భారతదేశంలో అతిపెద్ద అర్బన్ బ్యాంకు గా కొనసాగుతున్న విశాఖపట్నం కోపరేటివ్ అర్బన్ బ్యాంక్,57వ శాఖను మంగళవారం కొత్తపేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బ్యాంకు చైర్మన్ సత్యన్నారాయణమూర్తి మాట్లాడుతూ 1916 ఫిబ్రవరి 5వ తేదీన ఆవిర్భవించిన తమ బ్యాంకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ అంచలంచలుగా, ఎదుగుతూ, ఉన్నతంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం 8 వేల కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు రంగంలో సహకార రంగ సూత్రాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. బ్యాంకు పాలక వర్గం నిబద్ధతను దృష్టిలో ఉంచుకుని, గడిచిన 42 సంవత్సరాలుగా పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతున్నాయని, అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ సంవత్సరం కూడా పాలకవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి అన్నారు. తమ బ్యాంకు భవిష్యత్ కార్యాచరణను, నూతనంగా ప్రారంభించనున్న, బ్రాంచ్‌ల, వివరాలను మూర్తి వెల్లడించారు. సమావేశంలో విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు ప్రొఫెసర్ నన్నపనేని అంజయ్య, చిన్నం కోటేశ్వరరావు, చుక్కపల్లి రామారావు, పీవీ మల్లికార్జునరావు, డిప్యూటీ సీఈవో ఎంవి గణేష్ కుమార్, విజయవాడ జోనల్ మేనేజర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, తెనాలి బ్రాంచ్ మేనేజర్ జివిల్ వి ప్రకాష్ రావు , సిబ్బంది పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మహిళా సమానత్వ దినోత్సవం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో లిఉమెన్ సెల్ మరియు NSS సెల్‌లి సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 26న అంతర్జాతీయ మహిళా సమానత్వ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు లిడాక్టర్ బొల్లినేని కీర్తి గారులి విచ్చేసి విద్యార్థినీలకు ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. ఆమె తన ప్రసంగంలో, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అపూర్వమని, మహిళా విద్యా విస్తరణతోనే సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. స్వావలంబనతో పాటు కెరీర్ క్లారిటీ, కమిట్మెంట్, కాన్ఫిడెన్స్ అనే నాలుగు మూల సూత్రాలను ఆచరిస్తూ అబ్బాయిలు – అమ్మాయిలు ఇద్దరూ సమానంగా ఎదగాలని సూచించారు. సమానత్వ సమాజమే సౌహార్దం, సమతుల్యం మరియు అభివృద్ధికి బాటలు వేస్తుందని వివరించారు. కార్యక్రమాన్ని ఉమెన్ సెల్ కోఆర్డినేటర్ ఆర్. రత్న మంజుల సమన్వయం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు జ్యోతి తదితరులు సహకరించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. పాముల రెడ్డిలి, వివిధ విభాగాధిపతులు అతిథిని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.

ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు, అధ్యాపకులు, బి.ఫార్మసీ, ఫార్మా-డి, డి.ఫార్మసీ విద్యార్థులు, అలాగే NSS జెండర్ ఈక్వాలిటీ క్లబ్ స్టూడెంట్ కోఆర్డినేటర్లు అక్సా సాత్విక, కె. హర్షవర్ధన్, బి.సంజన, జి కీర్తి , కే కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కమిటీలు కచ్చితంగా తగు జాగ్రత్త లు పాటించాలి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ప్రజలు ఎటువంటి కలహాలు గొడవలు లేకుండా శాంతియుతంగా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని బ్రహ్మంగారిమఠం సబ్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ కోరారు. వినాయక చవితి ఉత్సవ కమిటీలు కచ్చితంగా విగ్రహం వద్ద 24 గంటలు ఉండాలని భద్రత శుభ్రత సౌకర్యాలను దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతం రంగ ఉండాలని, ఎటువంటి అంతరాయం రాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక సిబ్బందితో మాట్లాడి ఫైర్ సేఫ్టీ కి సంబంధించిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి విగ్రహం వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. అసభ్యకరమైన ప్రదర్శనలు పాటలు పెట్టడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నామని, వినాయక చవితి ఉత్సవ్ కమిటీ సభ్యులు దీనికి సహకరించాలన్నారు. ఊరేగింపు సమయంలో మద్యం సేవించకుండా పిల్లలు మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మదిన సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా సూర్యాస్తమయానికి ముందే పూర్తి చేయాలన్నారు. వినాయక ఉత్సవ కమిటీలు వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యుల ఫోన్ నెంబర్లు ప్రదర్శించాలని అలాగే పోలీస్ స్టేషన్ అగ్నిమాపక నెంబర్లు స్పష్టంగా కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పైచేసిన సూచనలన్నీ ప్రతి ఒక్కరూ పాటించాలని పండుగ ప్రశాంతంగా భద్రతగా ముగిసేలా అందరూ పోలీసులకు సహకరించాలన్నారు.

## మారథాన్‌లో మెరిసిన జిల్లా పోలీసులు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్‌లో జరిగిన ఎన్ఎండీసీ హైదరాబాదు మారథాన్-2025లో గుంటూరు జిల్లా పోలీస్ సిబ్బంది ప్రతిభ కనబర్చారు. నల్లపాడు పోలీస్‌స్టేషన్లో ఏఎస్సైగా పనిచేస్తున్న కె.రాజశేఖర్ బాబు 42 కిలోమీటర్ల ఫుల్‌మారథాన్‌ను 4 గంటల 42 నిమిషాల్లో పూర్తి చేయగా, జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డు జి.కృష్ణకిషోర్ 4 గంటల 59 నిమిషాల్లో పూర్తి చేశారు. దాదాపు 2వేల మంది పాల్గొన్న ఈ మారథాన్‌లో 5 గంటల్లోపే పరుగును ముగించడంతో ఇద్దరికీ పతకాలు లభించాయి. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వారిని అభినందించారు. పోలీసులు ఇలాంటి క్రీడల్లో మెరగడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## తిరుమలదేవికి లోకేష్ అభినందనలు



**అమరావతి :** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన మాదాబత్తుల తిరుమలదేవికి ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందనలు తెలిపారు. బెస్ట్ టీచర్‌గా జాతీయ అవార్డు రావడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం పండిట్ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న శ్రీదేవి 'కమ్ టు లెర్న్ – గో టు సర్వ్ ది నేషన్' నినాదంతో వినూత్న బోధనా పద్ధతిలో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు ఉపాధ్యాయ లోకానికి స్ఫూర్తిగా నిలుస్తుందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## రాష్ట్ర సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



- మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం
- పర్యావరణ భద్రత మనందరి బాధ్యత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వినాయక చవితిని పురస్కరించుకుని మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం.. పర్యావరణ భద్రత మనందరి బాధ్యత అంటూ రాష్ట్ర సచివాలయంలో మట్టి వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున పంపిణీ చేశారు. రాష్ట్ర రెవిన్యూ, రిజిస్ట్రేషన్స్ మరియు స్టాంప్స్ శాఖామాత్యులు అనగాని సత్యప్రసాద్ తరపున వారి పేషీ అధికారులు, సిబ్బంది మట్టితో తయారు చేయబడిన అంకుర గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ అంకుల గణపతి ప్రతిమలలో ఒక విశిష్టిత ఉందని, గణపతి పూజ అనంతరం ఈ విగ్రహాన్ని నీటితో తడిపి నానబెడితే అందులో నుండి మొక్క వస్తుందని తద్వారా పచ్చదనం ఫరిడవిల్లుతుంది అంటున్నారు.
అదే విధంగా రాష్ట్ర కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ తద్వారా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలనే లక్ష్యంతో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. రాష్ట్ర కాలుష్య నివారణ మండలి చైర్మన్ పి.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్.ఎస్.ఎస్. అధికారి ఎం.సుధాకర్, కాలుష్య నివారణ మండలి ప్రర్యావరణ ఇంజనీరు మెహ్మద్ నజీనా బీగం తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ మానవ సమాజ భద్రత బాధ్యత ఫౌండేషన్ ప్రతినిధులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆర్టీసీ పదోన్నతులకు సీఎం గ్రీన్‌సిగ్నల్ - ఇ.యూ హర్షం

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక పదోన్నతి సమస్యకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న సుమారు 3 వేలమంది ఉద్యోగులకు పదోన్నతులు లభించే అవకాశం ఉందని ఏపిపిటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. 2019లో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనమైనప్పటి నుండి పదోన్నతులు నిలిచిపోయాయని, వీటి కోసం నిరంతరం కృషి చేసిన తమ యూనియన్ ప్రయత్నాలు ఫలించాయని రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్యలు తెలిపారు. ఆర్టీసీ ఎం.డి. ద్వారక తిరుమలరావు చొరవతో ఫైల్‌ను ప్రభుత్వం వద్దకు పంపగా, సీఎం ఇటీవల పదోన్నతులకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు యూనియన్ రాష్ట్ర కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

## మెగా డీఎస్సీతో నెరవేరిన యువత కల



- ఎమ్మెల్యే గళ్ళా మాధవి

ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి, యువత కలలను నిజం చేసినదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కొనియాడారు. మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడుతూ యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమేనని, 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించి, వేలాది మంది యువతకు ఉపాధి కల్పించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు వయస్సు మినహాయింపు ఇచ్చి అండగా నిలిచామని, జగన్ రెడ్డి పాలనలో 5 ఏళ్లు ఒక్క డీఎస్సీ ఇవ్వకపోగా, చివర్లో కేవలం 6,100 పోస్టులతో యువతను మోసం చేశాడు. టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇచ్చి గందరగోళం సృష్టించాడు. ఆయన పాలనలో నాణ్యమైన విద్యలో రాష్ట్రం 3వ స్థానం నుంచి 19వ స్థానానికి పడిపోయిందన్నారు. ఇక ఉపాధ్యాయులపై జగన్ చేసిన అన్యాయాలు మర్చిపోలేనివని, పీఆర్సీ కోసం ఉద్యమించిన ఉపాధ్యాయుల పై లాఠీచార్జ్ చేయించడం, మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం వంటి అవమానకర నిర్ణయాలు తీసుకున్నాడని, పెయింట్లు, యాడ్స్‌తో విద్యారంగం మారదని, నిజమైన మార్పు ఉపాధ్యాయ నియామకాలతోనే సాధ్యమని, కూటమి ప్రభుత్వం నిరూపిస్తోందన్నారు. యువత కల నిజం చేస్తున్న నాయకుడు నారా లోకేష్ గారు" అని గళ్ళా మాధవి కొనియాడారు.

## సకాలంలో రుణాలు, ఇన్పుట్ సబ్సిడీలు..!



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఆయన తాజాగా మరో పథకాన్ని అమలు చేసే దిశగా కసరత్తులు చేస్తున్నారు. 'వన్ ఫ్యామిలీ–వన్ ఎంట్రప్రెన్యూర్' పథకంపై బ్యాంకుల సహకారం తీసుకోనున్నారు. ఇందులో భాగంగా బ్యాంకర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. 'వన్ ఫ్యామిలీ–వన్ ఎంట్రప్రెన్యూర్' పథకానికి బ్యాంకుల సహకారంపై చర్చించారు. ఈ సందర్భంగా బ్యాంకులు, ప్రజల మధ్య సంబంధంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలను నియంత్రించేలా బ్యాంకులు, ప్రభుత్వ విధానాలు ఉండకూడదని సూచించారు. రైతులకు రుణాలు, ఇన్పుట్ సబ్సిడీలను సకాలంలో అందించాలని, సంస్కరణల దిశగా ప్రజలను ప్రోత్సహించాలని బ్యాంకర్లను కోరారు. రైతులు, ప్రజలు, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా బ్యాంకులు నిర్ణయాలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

## నిస్వార్ధంగా పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుంది

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- శ్రీకాకుళం పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** నిస్వార్ధంగా తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసే వారికి సముచిత స్థానాన్ని పార్టీ అధిష్ఠానం కల్పిస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశానికి కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, శాసనసభ్యులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వర్యులు మాట్లాడుతూ సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సమష్టిగా ప్రతిఒక్క నాయకుడు, కార్యకర్త పనిచేసి త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. తెలుగు దేశం పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం వస్తుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో వైకాపా నాయకులు కార్యకర్తలను, యవకులను చాలా ఇబ్బందులకు గురిచేసిందని, అయినా కూడా కార్యకర్తలు అధైర్యపడకుండా ఉన్నారని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి పార్టీలు అధికారంలోకి తీసుకురావడంలో కీలక భూమిక పోషించారని అన్నారు. అధికారం వచ్చిందని ఆనందం కంటే బాధ ఎక్కువగా ఉందని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వైసీపీ నేతలు విచ్ఛిన్నం చేశారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సమర్ధవంతమైన నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. 2014-2019 సంవత్సర కాలంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకు వెళ్లలేకపోయామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలు అమలు చేశామని తెలిపారు. ప్రజల ఆశలను ఒమ్ము చేయకుండా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని అన్నారు. సమావేశంలో విప్ బెందాలం అశోక్, శాసనసభ్యులు గొండు శంకర్, గౌతు శిరీష, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, మార్క్ ఫెడ్ ఛైర్మన్ బంగార రాజు, జిల్లా పార్టీ అధ్యక్షులు కలమట వెంకటరమణ, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తల నుంచి వచ్చిన వినతలను స్వీకరించని కమిటీ సభ్యులు.

## యువతకు ఇచ్చిన హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

- కొనకళ్ల నారాయణ



**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్) :** యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో, మెగా డీఎస్సీ నిర్వహించాం అని ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించినట్లు, ప్రతి ఏటా మెగా డీఎస్సీ నిర్వహించి, యువ ఉపాధ్యాయులతో రాష్ట్ర విద్యారంగాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.
విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో గత 14 నెలలుగా విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని ఆయన చెప్పారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్టూడెంట్–టీచర్ రేషియోను సమతుల్యం చేసేందుకు ఉపాధ్యాయ నియామకాలు కీలకమని నమ్మే లోకేష్, యువత కలలను నిజం చేశారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు తమ 14 ఏళ్ల పాలనలో 13 డీఎస్సీల ద్వారా 1,96,619 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి చరిత్ర సృష్టించారని, ప్రస్తుతం విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల్లో అధికశాతం ఆయన హయాంలో నియమితులైనవారేనని ఆయన తెలిపారు.

**గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు :** గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మెగా డీఎస్సీ హామీ ఇచ్చి, ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకుండా విద్యారంగాన్ని నాశనం చేసిందని విమర్శించారు. ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలాగా నిలబెట్టడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించడం, ఎన్నికల విధుల నుంచి తప్పించడం, మధ్యాహ్న భోజన పథకం బాధ్యతలు అప్పగించడం వంటి చర్యలతో ఉపాధ్యాయుల గౌరవాన్ని దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. కోడిగుడ్ల సరఫరాలో జాప్యం జరిగినప్పుడు ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో అనేక చర్యలు చేపట్టిందని ఆయన వివరించారు. సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో 729 నాన్–టీచింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీ. 90 మంది ST యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమించడం. 700 కోయభారతి టీచర్ పోస్టుల భర్తీ. 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3,619 కాంట్రాక్టు లెక్చరర్ల సేవల పునరుద్ధరణ. ఉపాధ్యాయుల పై పని ఒత్తిడి తగ్గించేందుకు ఆరు రకాల బడుల విధానాన్ని తొమ్మిది రకాల బడులుగా మార్పు.

**యువతకు అవకాశాలు - మెగా డీఎస్సీ:** జగన్మోహన్ రెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించినప్పటికీ, నారా లోకేష్ గారి నాయకత్వంలో ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు, టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని ఆయన చెప్పారు. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు "ఎంతమంది పిల్లలైనా, అందరికీ తల్లికి వందనం" కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామని, రాష్ట్రంలో ప్రతి బిడ్డ చదువుకోవాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని అమలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర యువతను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటమే తెలుగుదేశం పార్టీ ఏకైక లక్ష్యమని కొనకళ్ల నారాయణ అన్నారు.

## విజయవాడలో ఏఐ యాప్‌తో ట్రాఫిక్ కష్టాలకు చెక్

- ఇకపై అందరకీ అందుబాటులోకి



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడ వాసులు నిత్యం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ట్రాఫిక్ జామ్. ఆ ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్నాక బయటకు వచ్చి వేరే మార్గంలో గమ్యస్థానం చేరాలన్నా సాధ్యం కాని పరిస్థితి. ఈ సమస్యను అరికట్టేందుకు నగర పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు ఏఐ ఆధారిత యాప్‌ను తయారు చేయిస్తున్నారు. డీజీపీ త్వరలో దీన్ని ప్రారంభించనున్నారు.

**అందరికీ అందుబాటులో:** ఇప్పటివరకు పోలీసు సిబ్బంది మాత్రమే ఉపయోగిస్తున్న 'అస్త్రం' అనే ఏఐ టూల్ ఇకపై అందరికీ యాప్ రూపంలో అందుబాటులో ఉండనుంది. గతేడాది దసరా ఉత్సవాల నుంచి ఈ యాప్?ని పోలీసుశాఖలో అంతర్గతంగా వినియోగిస్తున్నారు. టెలిగ్రామ్ యాప్‌లో కమిషనరేట్‌లోని ట్రాఫిక్ విభాగం అధికారులు, సిబ్బందిని జతచేశారు. దీని ద్వారా సంబంధిత పోలీసులకు రద్దీ సమాచారం అలెర్టులు వెళ్తాయి. వీటి ఆధారంగా ట్రాఫిక్‌ను తగ్గిస్తున్నారు. ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో పౌరులకూ ఈ సేవలు విస్తరించాలని నిర్ణయించారు.

**ప్రత్యామ్నాయ మార్గాలనూ చూపిస్తుంది:** ఈ యాప్‌లో పలు రకాల ఫీచర్లను పొందుపరుస్తున్నారు. నగర మ్యాప్‌ను అనుసంధానిస్తారు. ఇంత అన్ని మార్గాల్లో ట్రాఫిక్ రద్దీని చూపిస్తుంది. 300 మీటర్ల వరకు ట్రాఫిక్ ఆగితే మధ్యస్తం అని, 300 – 500 మీటర్ల వరకు అయితే ఎక్కువ అని, అంతకంటే ఎక్కువ దూరం ఆగితే తీవ్రం అని హెచ్చరికలు మొబైల్‌కు వస్తాయి. మొబైల్‌లో జీపీఎస్ ఆన్ చేసుకుంటే మనం ఉన్న ప్రాంతంలో రద్దీ ఎలా ఉంది? ఒకవేళ ఎక్కువగా ఉంటే ప్రత్యామ్నాయ మార్గాల్లో ఎలా గమ్యస్థానం చేరుకోవాలో చెప్తుంది. అందులోనే డైరెక్షన్లు కూడా వస్తాయి. నగరంలో భారీ వర్షం పడి రోడ్లపైకి నీరు వస్తే ఆ వివరాలు కూడా ఈ యాప్ తెలియజేస్తుంది. సురక్షిత మార్గాల వివరాలు అందిస్తుంది. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రోజుల్లో ట్రాఫిక్ మళ్లింపుల వివరాలు, గ్రీన్ ఛానల్ ఉన్న వీవీఐపీల వాహన శ్రేణి వెళున్న సమయంలోనూ నోటిఫికేషన్లు వస్తాయి.

**వాతావరణ సమాచారం, చలానాల చెల్లింపులు:** విజయవాడ జంక్షన్ మీదుగా తిరిగే రైళ్లు, బస్సుల వివరాలను కూడా యాప్‌లో పొందుపరుస్తున్నారు. వీటితో పాటు నగరంలో వాతావరణ సమాచారాన్ని కూడా జోడిస్తున్నారు. వర్షం, పిడుగులు పడే అవకాశాలు, ఉష్ణోగ్రతలు, తేమ శాతం, తదితర వివరాలు ప్రతి గంటకూ అప్‌డేట్లు వస్తుంటాయి. ఈ–చలానాలను చెల్లించేందుకు సైతం వెసులుబాటు కల్పించారు. వాహనం నంబరు ఎంటర్ చేస్తే పేమెంట్ గేట్‌వేలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ



**నంద్యాల(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అర్హులైన దివ్యాంగులందరికి సదరన్ క్యాంపుల ద్వారా మెడికల్ సర్టిఫికెట్ ఇచ్చి నెలకు రూ. 6 వేల పెన్షన్ అందిస్తున్నారని, కొందరు ఈ ఎన్ టీ వైద్యుల అలసత్వం వల్ల సదరన్ క్యాంపుకు వచ్చిన దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారని, ఇలా చేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం ఎలా నెరవేరుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మంగళవారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.
సదరన్ క్యాంపుకు వచ్చే వికలాంగులను ఎందుకు తిప్పుకుంటున్నారని, స్లాబ్ బుక్ చేసుకోని ఆ తేదీననే వస్తే ఎందుకు పరీక్షలు చేయడం లేదని, కడప రిమ్స్ హాస్పిటల్‌కు ఎందుకు రెఫర్ చేస్తున్నారని ప్రభుత్వ ఈ ఎన్ టీ డాక్టర్‌ను ఎంపీ డాక్టర్ ప్రశ్నించారు. ఈ ఎన్ టీ విభాగంలో అవసరమైన ఆధునిక ఆడియో పరికరాలకు ఎంపీ నిధులు కేటాయిస్తానని, వారిని ఇబ్బంది పెట్టవద్దని, దివ్యాంగులను మీరు ఇబ్బంది పెడితే ప్రభుత్వంకు చెడ్డ పేరు వస్తుందని, జాగ్రత్తలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సూచనలు చేశారు. ఎంపీ శబరి వెంట ఆసుపత్రిలో మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మదన్ మోహన్, ఆర్ ఎం ఓ డాక్టర్ వెంకటకృష్ణ, ఈ ఎన్ టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జై బాకౌశల్, డాక్టర్ సాహెల్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాథ్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, రైల్వే జోనల్ వినియోగదారుల మెంబర్ ఎ. వెంకటరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం రద్దు చేయాలి : సిఐటియు ఏపీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెన్షనర్ల హక్కులను హరించే పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల దేశవ్యాప్త ఆందోళనలకు, మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సిఐటియు ఏపీ రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు తెలిపారు. పే రివిజన్‌కు ముందు రిటైరైనవారికి, తర్వాత రిటైరైనవారికి సమానంగా పెన్షన్ సవరణ కల్పించకూడదని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫైనాన్స్ చట్టం 2025లోని పార్ట్ 4 (సెక్షన్లు 149, 150)లో మార్పులు చేసినట్లు ఆయన చెప్పారు. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం పెన్షనర్ల రాజ్యాంగబద్ధమైన హక్కుపై దాడి చేసిందని ఆరోపించారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ఉల్లంఘించడం మాత్రమే కాకుండా, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధమని అన్నారు. ముప్పై–నలభై సంవత్సరాల పాటు ప్రజాసేవ చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు ఇప్పుడు అదే పెన్షన్‌తో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని నాగేశ్వరరావు పేర్కొన్నారు. పెన్షన్ వ్యాలిడేషన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు పెద్ద సంఖ్యలో పెన్షనర్లు హాజరయ్యారు. సదస్సుకు కాశి వరప్రసాద్ అధ్యక్షత వహించగా, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏ.వి.నాగేశ్వరరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. రాష్ట్రంలోని 13 కేంద్ర శాఖల సంఘాల నేతలు కూడా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి పెన్షనర్లు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు.

## ఐపిఎస్ అధికారి సునీల్‌కుమార్ సస్పెన్షన్ పొడిగింపు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఐపిఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ సస్పెన్షన్‌ను వచ్చే ఏడాది ఫిబ్రవరి 24 వరకు పొడిగిస్తూ ఎపి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ పర్యటనలకు వెళ్లారన్న అభియోగాలు నిరూపణ కావడంతో ఆయన్ను ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో రెండు రోజుల్లో సస్పెన్షన్ గడువు ముగియనుండటంతో రివ్యూ కమిటీ సమీక్ష నిర్వహించింది. అగ్రిగోల్డ్ నిధుల దుర్వినియోగంపై సునీల్‌కుమార్‌పై ఎసిబి విచారణ కొనసాగుతోంది. మరోవైపు గతంలో అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును వేధించిన కేసులోనూ గుంటూరు నగరపాలెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సస్పెన్షన్ ఎత్తివేస్తే సాక్ష్యాధారాలు, దర్యాప్తును ప్రభావితం చేస్తారని రివ్యూ కమిటీ నివేదించింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున సస్పెన్షన్ పొడిగించాలని సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు తీసుకోవాలని డిజిపి ని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు సస్పెన్షన్ ఆదేశాలను పొడిగిస్తూ సిఎస్ విజయానంద్ ఆదేశాలు జారీ చేశారు.

## విస్తరణకు సిద్ధమైన గుంటూరు ఛానెల్

- పెమ్మసాని చొరవతో వేగం పుంజుకున్న అడ్మినిస్ట్రేషన్ వర్క్స్
- భూసేకరణ ప్రాథమిక ప్రకటనకు కలెక్టర్ అనుమతులు
- 60 రోజుల్లో అభ్యంతరాలు వ్యక్తీకరణకు అవకాశం



గుంటూరు: దశాబ్ద కాలం నాటి ఎదురుచూపులకు పెమ్మసాని తెరదించారు. గుంటూరు ఛానెల్ విస్తరణ పనుల్లో వేగం పెంచారు. విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన జిల్లా యంత్రాంగం తొలి దశలో భాగంగా ప్రాథమిక ప్రకటనకు కలెక్టర్ నాగలక్ష్మీ గారు అనుమతులు మంగళవారం మంజూరు చేశారు. కాగా ప్రాథమిక ప్రకటనపై ఏవేని అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లో వ్యక్తీకరించే అవకాశం కల్పిస్తూ ఈ ప్రకటనను విడుదల చేస్తున్నారు. ఫర్ఫెక్ట్ ప్లానర్గా పేరున్న పెమ్మసాని గారి దూరదృష్టి కారణంగా నాలుగు దశల్లో విడుదల కావాల్సిన నిధుల్లో తొలి దశ రూ. 30.5 కోట్ల నిధులు కూడా జిల్లా ఖజానాకు వచ్చి చేరాయి.

**ప్రాథమిక ప్రకటనకు గ్రీన్ సిగ్నల్ :** గుంటూరు జిల్లాలోని 3 మండలాలు, 11 గ్రామాలకు ఉపయోగపడే విధంగా గుంటూరు ఛానెల్ విస్తరణ పనులకు మరో ముందడుగు పడింది. అందులో విభజిత గుంటూరు జిల్లాలోని 7 గ్రామాలలో 201.149 ఎకరాలకుగానూ భూసేకరణ నిమిత్తం ప్రస్తుతం నోటిఫికేషన్(ప్రాథమిక ప్రకటన) ఇచ్చేందుకు కలెక్టర్ అనుమతులు మంజూరు చేశారు. మిగిలిన 4 గ్రామాలకు ల్యాండ్ ప్లాన్ షెడ్యూల్ను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ భూసేకరణకు సంబంధించి రూ. 100 కోట్లను విడుదల చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గారికి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గారికి గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ లేఖలు రాయడమేగాక ఫాలో–అప్ చేస్తూ వచ్చారు. ఇందుకుగానూ సామాజిక అంచనా ప్రభావంకు సంబంధించి పెమ్మసాని గారి చొరవతో గెజిట్ నోటిఫికేషన్ చేయడం జరిగింది.

**సిద్ధంగా ఉన్న నిధులు :** పైన తెలిపిన విధంగా ముఖ్యమంత్రి బాబు తో పాటు పలువురు మంత్రులను సంప్రదించి, జరిపిన ప్రత్యోత్తరాల ఫలితంగా గుంటూరు ఛానెల్ విస్తరణకు గానూ నాలుగు దశల్లో నిధులు విడుదలకు మార్గం సుగమమైంది. రూ. 75.12 కోట్లు మంజూరు చేశారు. తొలి దశ నిధుల కింద రూ. 30.5 కోట్లు, రెండో దశకు రూ. 12.9 కోట్లు, మూడో దశ కింద రూ. 18.33 కోట్లు, చివరగా రూ. 25 కోట్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం కావడంతో పాటు తొలి దశ విడుదల చేయాల్సిన నిధులు ఇప్పటికే జిల్లా ఖజానాలో వచ్చి చేరాయి. దశల వారీగా జరిగే పనుల ఆధారంగా బిల్లులు విడుదలవుతాయి.

**పెమ్మసాని చొరవ:** సాధకుడు సంకల్పిస్తే సాధించలేదనిది లేదన్న నానుడి మరోసారి ఎప్పటికపుడు రుజువవుతోంది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పార్లమెంట్లో పాదం మోపిన పెమ్మసాని తన ఒక్కో అడుగును అభివృద్ధి దిశగా సాగిస్తున్నారు. అందులో భాగంగానే ఏళ్ల నాటి కలను సాధిస్తూ గుంటూరు ఛానెల్ అభివృద్ధికి రాష్ట్ర 2024-25 బడ్జెట్ నుంచి నిధులు సేకరింపజేసుకోవడంలో సఫలీకృతులయ్యారు. అక్కడితో ఆయన తన డ్యూటీ అయిపోయిందనుకోలేదు. జిల్లా యంత్రాంగం చేపట్టాల్సిన ప్రతీ పనిని రివ్యూ చేస్తూ, ఎప్పటికప్పుడు పరిష్కారాలకు కృషి చేస్తున్నారు. ఇపుడు భూసేకరణకు ఎదురవుతున్న అడ్డంకులను కూడా ఆయనే దగ్గరుండి పరిష్కరించిన కారణంగా ఫారం-6(ఏ) కు మార్గం సుగమమైంది. తద్వారా విస్తరణ పనులు వేగం పుంజుకున్నాయి. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కి, జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి అలాగే స్థానికంగా తమ ప్రయత్నాలకు సహాయ సహకారాలు అందిస్తున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు కి పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467